


సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com




ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 69 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజీలు : 8, వెల రూ. 4, /- గురువారం - 29 - మే - 2025

## మిస్ వరల్డ్ 2025 ఫైనల్స్.. వెయ్యిమంది సామాన్యులకు ఆహ్వానం




హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి 2025 ఫైనల్స్

వచ్చే ఆదివారం హైటెక్స్‌లో తుది ఘట్టం

120 దేశాల్లో సోనీ టీవీలో లైవ్ టెలికాస్ట్

## కొత్త పార్టీ వార్తలపై తీవ్రంగా స్పందించిన కవిత, పత్రికపై ఆగ్రహం

కొత్త పార్టీ ఏర్పాటు వార్తలను ఖండించిన ఎమ్మెల్సీ కవిత



సోషల్ మీడియా కథనాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కవిత

తనను సంప్రదించకుండా వార్తలు రాశారని ఓ పత్రికపై ఫైర్

అది జర్నలిజమా లేక శాడిజమా అంటూ ఎక్స్‌లో ఘాటు వ్యాఖ్య

## ఆ రోజు బంగ్లాదేశ్‌ను విడిచేందుకు హసీనా మొదట ససేమిరా అన్నారు: చీఫ్ ప్రాసిక్యూటర్



అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఎదుట తజుల్ ఇస్లాం కీలక వివరాలు

ఉద్రిక్తతల వేళ దేశం విడిచి వెళ్లేందుకు షేక్ హసీనా నిరాకరించారని వెల్లడి

సైనికాధికారులు రాజీనామా కోరినా, ప్రధాని పదవి వదలనన్న హసీనా

పారిపోయే బదులు తనను కాల్చి చంపాలని సైన్యాన్ని కోరినట్లు వెల్లడి

## కాళేశ్వరంపై విచారణ.. జూన్ 5న కమిషన్ ముందుకు కేసీఆర్



- రిటైర్డ్ ఇంజనీర్లు, న్యాయ నిపుణులతో కేసీఆర్ చర్చలు
- ఇప్పటికే కేటీఆర్, హరీశ్‌రావుతో సమావేశమైన కేసీఆర్
- జూన్ 9న విచారణకు హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్రమంత్రి సీరియస్ వార్నింగ్!



- కొందరు నేతలు వ్యక్తిగత ఎజెండాలతో పనిచేస్తున్నారని కిషన్ రెడ్డి అసహనం
- అనుమతి లేకుండా ప్రెస్ మీట్లు పెడితే కఠిన చర్యలని స్పష్టం
- పార్టీ కార్యాలయాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు వాడొద్దని సూచన
- బీజేపీ బాధ్యత గల పార్టీ అని, ప్రజల పక్షాన నిలవాలని పిలుపు

# అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారమే రిజర్వేషన్లు అన్న రేవంత్ రెడ్డి

- మాజీ సీఎం ఇంట్లోవాళ్లకే ఉద్యోగాలు ఇచ్చుకున్నారు: సీఎం రేవంత్ ఫైర్
- ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా మార్చింది కాంగ్రెస్సేనని వ్యాఖ్య
- చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమన్న రేవంత్ రెడ్డి
- గత ప్రభుత్వం పేదలకు ఉద్యోగాలు ఇవ్వలేదని సీఎం విమర్శ



- ఉద్యోగ నియామకాలపై కుట్రలు జరుగుతున్నాయని ఆరోపణ

హైదరాబాద్, : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి అనుగుణంగానే రాష్ట్రంలో రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరిగిన గురుకుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మిగతా.. 2లో

# మహానాడు వేదికపై ఎన్టీఆర్ కు చంద్రబాబు నివాళి



- తెలుగుజాతి గుండెల్లో పెట్టుకున్న ఏకైక నాయకుడు ఎన్టీఆర్
- రెండు రంగాల్లో రారాజుగా రాణించడం ఎన్టీఆర్ కు మాత్రమే సాధ్యమైన ఘనత
- సమాజంలో అన్ని వర్గాలు కీర్తించే నాయకుడని కొనియాడిన చంద్రబాబు

అమరావతి,: తెలుగుజాతి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి ఎన్టీఆర్ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మహానాడు వేదిక పైనుంచి నివాళులు అర్పించారు. ఒకే వ్యక్తి రెండు రంగాల్లో రారాజుగా రాణించడం కేవలం ఎన్టీఆర్ కు మాత్రమే సాధ్యమైన ఘనత అని చెప్పారు. సాధారణ రైతు బిడ్డగా పుట్టిన ఎన్టీఆర్ నటుడిగా, రాజకీయ నాయకుడిగా రాణించారని గుర్తు చేశారు. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించిన నాయకుడు మిగతా.. 2లో

## లిక్కర్ స్కామ్... జైల్లో ఉన్న రాజ్ కసిరెడ్డిని విచారిస్తున్న ఈడీ అధికారులు



లిక్కర్ స్కామ్ లో ఈడీ విచారణ

డబ్బు ఎలా మళ్లించారు, ఎవరెవరికి చేరిందనే కోణంలో దర్యాప్తు

సిట్ అధికారులతో నిన్న ఈడీ అధికారుల భేటీ

అమరావతి,: మద్యం కుంభకోణం ఏపీ రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్న సంగతి తెలిసిందే. మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తమ దర్యాప్తును ప్రారంభించారు. మిగతా.. 2లో




ఏపీలో పూర్తిగా విస్తరించిన నైరుతి రుతుపవనాలు: ఏపీఎస్డీఎంఏ ప్రకటన

మే 26 రాయలసీమలో ప్రవేశం

మే 28 నాటికి రాష్ట్రమంతటా విస్తరణ

అధికారికంగా ప్రకటించిన ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ



అమరావతి,: ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి ఎంతో ఉపశమనం కలిగిస్తూ నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతటా విస్తరించాయి. ఎండల తీవ్రతతో అల్లాడుతున్న జనాలకు చల్లని కబురు అందిస్తూ, వ్యవసాయ రంగానికి కొత్త ఆశలు రేకెత్తిస్తూ ఈ పవనాలు రాష్ట్రమంతటా మిగతా.. 2లో

# టీడీపీ.. తెలుగు డ్రామా పార్టీ: వైఎస్ జగన్

- ఇచ్చిన హామీలు నెరవేర్చడం నిజమైన సత్తా అవుతుంది
- చంద్రబాబు.. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ గాలికొదిలేశారు.
- పేదలు వైద్యంకోసం అప్పులు పాలు అవుతున్నారు
- రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు టీడీపీకి చెందిన గజ దొంగల ముఠా జేబుల్లోకి పోతోంది"
- తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంపై, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.



గుంటూరు: తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంపై, ఆ పార్టీ అధినేత చంద్రబాబు పై మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బుధవారం పార్టీ స్థానిక సంస్థల ప్రతినిధులతో భేటీలో బాబు సర్కార్ ఎన్నికల హామీల అమలును ప్రశ్నించారాయన. టీడీపీ అంటే.. తెలుగు డ్రామా పార్టీ. మహానాడు పెద్ద డ్రామా. చంద్రబాబు మహానాడులో ఫోజులు ఇస్తున్నారు. సత్తా అంటే కడపలో మహానాడు పెట్టడం కాదు. కడపలో మహానాడు పెట్టి.. జగన్‌ను తిట్టడం సత్తా ఎలా అవుతుంది?. ఇచ్చిన హామీలు నెరవేర్చడం నిజమైన సత్తా అవుతుంది.. .. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలు చెప్పి, ఎక్కువ పరిష్కారాలు పొందిన వాళ్లు టీడీపీ వాళ్లే. ఎమ్మెల్యేలు వద్దన్నా.. వారికి మనం మంచి చేశాం. కానీ, చంద్రబాబు అన్యాయాలు చేస్తున్నారు. దీనికి వడ్డీ సహా చెల్లిస్తాం. అప్పుడే మరోసారి ఇలాంటి తప్పులు చేయడానికి భయపడతారు" అని జగన్ అన్నారు... చంద్రబాబు.. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ గాలికొదిలేశారు. 143 హామీలను పూర్తిగా మిగతా.. 2లో

# చిన్నారులపై అఘాయిత్యాలు ఇంకా ఎంతకాలం?: పవన్ కల్యాణ్

- కడప జిల్లా కంబాలదిన్నెలో మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య
- ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి
- బంధువే ఈ దారుణానికి పాల్పడటం సమాజానికి సిగ్గుచేటని పవన్ ఆవేదన
- నిందితుడిని కఠినంగా శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని పిలుపు



అమరావతి,: వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామంలో నాలుగు రోజుల క్రితం జరిగిన మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని పసిమొగ్గపై బంధువుగా చెప్పబడుతున్న వ్యక్తే ఈ ఘాతుకానికి పాల్పడటం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయమని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వార్త తన హృదయాన్ని తీవ్రంగా కలచివేసిందని, సమాజంగా మనం ఎక్కడ మిగతా.. 2లో

# అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారమే రిజర్వేషన్లు అన్న రేవంత్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా తీర్చిదిద్దిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. చదువుకు ఉన్న ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, "చాలామంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు, చదువు మాత్రమే. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుంది" అని సీఎం అన్నారు. సమాజంలో నెలకొన్న రుగ్మతలు, అసమానతలను నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కోఠిలోని మహిళా కళాశాలకు వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి గౌరవించుకున్నామని గుర్తుచేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక విద్యార్థి చదువు, ఆరోగ్యం బాగుండాలంటే, వారు చదువుకునే పరిసరాలు, మౌలిక సదుపాయాలు కూడా అంతే ముఖ్యమని సీఎం వ్యాఖ్యానించారు. గత పాలకుల వైఖరిని విమర్శిస్తూ, "ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు చదువులు వద్దని, వారు కులవృత్తులు మాత్రమే చేసుకోవాలని గత పాలకులు భావించారు. దళితులు, బీసీలు గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ ఉండాలన్నట్టుగా మాజీ సీఎం వ్యవహరించారు" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువత ఆశలపై గత ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆయన విమర్శించారు. "మాజీ ముఖ్యమంత్రి తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ,



రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. అయినప్పటికీ, ఇంకా లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయకుండా కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. "నోటికాడికి వచ్చిన ముద్ద లాక్కున్నట్టుగా కేసులు వేస్తున్నారు. ఆరు నెలలు కూడా విరామం లేకుండా వాళ్ల ఉద్యోగాలు భర్తీ చేసుకుంటున్నారు. విద్యార్థులకు మాత్రం సంవత్సరాల తరబడి ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నారు" అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అడ్డుకుంటున్న వారిని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

## ఆ రోజు బంగ్లాదేశ్‌ను విడిచేందుకు హసీనా మొదట ససేమిరా అన్నారు: చీఫ్ ప్రాసిక్యూటర్

**న్యూఢిల్లీ,:** గత సంవత్సరం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సమయంలో, అప్పటి ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లేందుకు తొలుత తీవ్రంగా నిరాకరించారని ఆ దేశ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం వెల్లడించారు. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో జరుగుతున్న విచారణ సందర్భంగా ఆయన ఈ విషయాలు వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగి, పరిస్థితి అదుపు తప్పుతున్న సమయంలో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి, దేశం విడిచి వెళ్లిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, ఆమెతో పాటు పలువురు మాజీ మంత్రులు, సలహాదారులు, సైనికాధికారులపై బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన విచారణలో భాగంగా చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం కీలక వివరాలను ట్రిబ్యునల్ ముందుంచారు. గత ఏడాది ఆగస్టు 4వ తేదీన, దేశంలో అల్లర్లు తారాస్థాయికి చేరడంతో, కొందరు సైనికాధికారులు షేక్ హసీనా నివాసానికి వెళ్లి ఆమెను తక్షణమే రాజీనామా చేయాల్సిందిగా కోరినట్లు ఇస్లాం తెలిపారు. అయితే, అప్పటి అధికార అవామీ లీగ్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, పార్లమెంట్ స్పీకర్ షిరిన్ షర్మిన్ చౌదరి కూడా ప్రధాని పదవి నుంచి వైదొలగాలని హసీనాకు సూచించినట్లు ఇస్లాం వివరించారు. అయినప్పటికీ, దేశం విడిచి వెళ్లాలన్న సూచనను షేక్ హసీనా తీవ్రంగా ప్రతిఘటించారని ప్రాసిక్యూటర్ తెలిపారు. "పారిపోవడం కంటే నన్ను ఇక్కడే కాల్చి చంపేయండి. గణబంధన్‌లోనే నన్ను సమాధి చేయండి" అని ఆమె సైనికాధికారులతో అన్నట్లు తజుల్ ఇస్లాం తెలియజేశారు. చివరికి, అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో, ఇష్టం లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె దేశం విడిచి వెళ్లారని ఆయన స్పష్టం చేశారు. గత సంవత్సరం ఆగస్టు 5న షేక్ హసీనా బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఆమెపై వందకు పైగా కేసులు నమోదై ఉన్నాయి. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ ఇప్పటికే ఆమెపై అరెస్ట్ వారెంట్ జారీ చేయగా, కేసు విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో, షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం పలుమార్లు భారత ప్రభుత్వానికి దౌత్యపరమైన అభ్యర్థనలు పంపింది.

## మిస్ వరల్డ్ 2025 ఫైనల్స్.. వెయ్యిమంది సామాన్యులకు ఆహ్వానం

**హైదరాబాద్, :** హైదరాబాద్ మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వనుంది. మిస్ వరల్డ్ 2025 పోటీల తుది ఘట్టం నగరంలోని హైటెక్స్ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుండగా, ఇప్పటికే నాలుగు ఖండాలకు చెందిన 40 దేశాల నుంచి ప్రతినిధుల ఎంపిక పూర్తయింది. వచ్చే ఆదివారం సాయంత్రం జరిగే ఈ ఫైనల్స్ కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లను పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం ఆయన సైబరాబాద్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్, పర్యాటక శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తుది పోటీలు హైటెక్స్‌లోని హాల్ నంబర్ 4లో జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమై రాత్రి 9:20 గంటలకు ముగిసే ఈ కార్యక్రమానికి సుమారు 3500 మంది కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం హైటెక్స్‌లో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు జయేశ్ రంజన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఈ అంతర్జాతీయ వేడుకలో కేవలం ప్రముఖులే కాకుండా సాధారణ ప్రజలకు కూడా భాగస్వామ్యం కల్పిస్తున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించగా సుమారు 7500 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో దాదాపు వెయ్యి మందికి అవకాశం కల్పించనున్నట్లు జయేశ్ రంజన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, బాలీవుడ్, టాలీవుడ్ సినీ ప్రముఖులను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచినట్లు ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఫైనల్స్‌కు సంబంధించిన ప్రాక్టీస్ సెషన్లు మంగళవారం నుంచే ప్రారంభమయ్యాయని, బుధ, గురువారాల్లో కూడా ఇవి కొనసాగుతాయని జయేశ్ రంజన్ వెల్లడించారు. పూర్తిస్థాయి రిహార్సల్స్ మే 30, 31 తేదీల్లో ఉదయం జరుగుతాయని తెలిపారు. ఈ తుది పోటీలను సోనీ టీవీ ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనుందని, ఈ ప్రసార సమయంలో దాదాపు 50 నుంచి 60 నిమిషాల పాటు తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటక ప్రాంతాల గురించి ప్రత్యేకంగా చూపిస్తారని ఆయన పేర్కొన్నారు. కాగా, తుది పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎవరు వ్యవహరిస్తారనే వివరాలను మిస్ వరల్డ్ సంస్థ త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తుందని జయేశ్ రంజన్ తెలిపారు.

## కొత్త పార్టీ వార్తలపై తీవ్రంగా స్పందించిన కవిత, పత్రికపై ఆగ్రహం

హైదరాబాద్, : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా రాజకీయ పార్టీ పెట్టబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై ఆమె స్పందించారు. ఈ ఊహాగానాల్లో ఎటువంటి నిజం లేదని స్పష్టం చేస్తూ, ఒక దినపత్రికలో వచ్చిన కథనం క్లిప్పింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. "కనీసం నన్ను సంప్రదించకుండా ఈ వార్త రాసిన పత్రికది జర్నలిజమా?? శాడిజమా?" అంటూ ఆమె ప్రశ్నించారు. ప్రస్తుతం కవిత చేసిన ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. కొంతకాలంగా తెలంగాణ జాగృతి సంస్థను బలోపేతం చేసే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు. జాగృతికి అనుబంధ సంఘాలను వరుసగా ప్రకటించడం, సంస్థ కార్యకలాపాలను విస్తరించడం వంటి పరిణామాలతో ఆమె కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ అనంతరం పార్టీ అధ్యక్షుడు, తన తండ్రి కేసీఆర్‌కు ఆమె ఒక లేఖ రాయడం, ఆ తర్వాత అమెరికా పర్యటనకు వెళ్ళే ముందు జాగృతి అనుబంధ సంఘాల బాధ్యులను ప్రకటించడం వంటివి ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చాయి. సామాజిక మాధ్యమాల్లో అయితే ఏకంగా పార్టీ పేరు కూడా ఖరారైందని, కేసీఆర్ పంపిన దూతలతో కవిత జరిపిన మంతనాలు విఫలమయ్యాయని కథనాలు వెలువడ్డాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీన కవిత తన కొత్త పార్టీని ప్రకటిస్తారంటూ విస్తృతంగా వార్తలు వచ్చాయి. అయితే, ఈ కథనాలన్నింటినీ కవిత ఖండించారు. తనను సంప్రదించకుండా అవాస్తవాలు ప్రచురించడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.

## తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్రమంత్రి సీరియస్ వార్నింగ్!

**హైదరాబాద్, :** తెలంగాణలోని పార్టీ నేతల తీరుపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బుధవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు నేతలు వ్యక్తిగత ఎజెండాలతో పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై ఇటువంటి ధోరణులను సహించేది లేదని, గీత దాటితే కఠిన చర్యలు తప్పవని ఆయన గట్టిగా హెచ్చరించారు. పార్టీ కార్యాలయాన్ని కొందరు తమ వ్యక్తిగత అవసరాలకు, ప్రచారాలకు వాడుకుంటున్నారని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ ఆఫీసులో కేవలం పార్టీ విధానాలకు అనుగుణంగానే మాట్లాడాలని, పార్టీ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఎవరూ ప్రవర్తించకూడదని ఆయన సూచించారు. ముఖ్యంగా, నేతలు ఇష్టానుసారంగా ప్రెస్ మీట్లు నిర్వహించి, వ్యక్తిగత దూషణలకు దిగడంపై కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకమీదట పార్టీ నాయకులు ఎవరైనా ప్రెస్ మీట్ పెట్టాలంటే కచ్చితంగా ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. ఈ నిబంధన తనతో సహా పార్టీలోని ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ నాయకులు హుందాగా ప్రవర్తించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. భారతీయ జనతా పార్టీ అంటే సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన బాధ్యత గల పార్టీ అని కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ప్రజలు పార్టీ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారని, అలాంటి వారికి న్యాయం జరిగేలా నేతలు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా, అనవసర వివాదాలు సృష్టిస్తూ, వ్యక్తిగత దూషణలకు పాల్పడితే పార్టీ చూస్తూ ఊరుకోదని ఆయన మరోసారి హెచ్చరించారు. నేతలందరూ సమష్టిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కిషన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## కాళేశ్వరంపై విచారణ.. జూన్ 5న కమిషన్ ముందుకు కేసీఆర్

**హైదరాబాద్, :** కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన ఘటనపై జరుగుతున్న విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హాజరు కావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించుకున్నారు. పలు దఫాలుగా రిటైర్డ్ ఇంజనీర్లు, న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపి, వారి సలహాలు స్వీకరించిన అనంతరం జూన్ 5వ తేదీన విచారణకు హాజరుకావాలని ఆయన నిర్ణయించినట్లు బీఆర్ఎస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ఘటనపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ ఇప్పటికే వందకు పైగా అధికారులు, ఇతర వ్యక్తులను విచారించింది. వారిలో చాలామంది, అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల ప్రకారమే తాము నడుచుకున్నామని కమిషన్‌కు తెలియజేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీశ్ రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ ఇటీవల నోటీసులు జారీ చేసి, వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. హరీశ్ రావు, ఈటల రాజేందర్ విచారణకు హాజరవుతామని ఇప్పటికే స్పష్టం చేయగా, కేసీఆర్ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. గతంలో విద్యుత్ అవకతవకలపై నియమించిన కమిషన్ నోటీసులిచ్చినప్పుడు కేసీఆర్ న్యాయస్థానాలను ఆశ్రయించి, సుప్రీంకోర్టు నుంచి ఊరట పొంది విచారణకు హాజరుకాని నేపథ్యంలో కాళేశ్వరం కమిషన్ విషయంలో ఆయన వైఖరిపై సందిగ్ధత ఏర్పడింది. అయితే, ఈసారి విచారణకు హాజరు కావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆయన ఇప్పటికే రెండుసార్లు ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో మాజీ మంత్రి హరీశ్ రావుతో, ఒకసారి కేటీఆర్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. కమిషన్ నోటీసులకు ఎలా స్పందించాలి? విచారణ సమయంలో అడిగే ప్రశ్నలకు మౌఖికంగానా లేక లిఖితపూర్వకంగానా.. ఎలా సమాధానాలు ఇవ్వాలనే అంశాలపై వారు సమాలోచనలు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా, ఇప్పటికే కమిషన్ విచారణకు హాజరైన రిటైర్డ్ ఇంజనీర్లతోనూ కేసీఆర్ సంప్రదింపులు జరుపుతున్నారని తెలిసింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు దెబ్బతినడానికి దారితీసిన పరిస్థితులపై కేసీఆర్ పూర్తిస్థాయిలో సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం. విజిలెన్స్ నివేదికలోని అంశాలు, ఎక్కడ లోపాలు జరిగాయి? నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఏం చెప్పింది? నిర్మాణ సంస్థలు కమిషన్‌కు ఎలాంటి సమాచారం ఇచ్చాయి? సమస్యలు తలెత్తడానికి గల ప్రధాన కారణాలు ఏమిటనే కోణంలో ఆయన ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు, దేశంలోని ఇతర ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్నవాటికి సంబంధించిన వివరాలను కూడా ఆయన సేకరించినట్లు సమాచారం. కాగా, మాజీ మంత్రి హరీశ్ రావు జూన్ 9న కమిషన్ విచారణకు హాజరుకానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

## చిన్నారులపై అఘాయిత్యాలు ఇంకా ఎంతకాలం?: పవన్ కల్యాణ్

ఈ వార్త తన హృదయాన్ని తీవ్రంగా కలచివేసిందని, సమాజంగా మనం ఎక్కడ విఫలమవుతున్నామనే ప్రశ్న మన ముందు నిలిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై అఘాయిత్యాలు ఇంకా ఎంతకాలం? యావత్ సమాజం తలదించుకునే ఆకృత్యానికి పాల్పడిన అటువంటి నరరూప మృగాళ్ళను కఠినంగా శిక్షించాలి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. "గతంలో కథువాలో ఆసిఫా అనే చిన్నారిపై జరిగిన దారుణమైన అఘాయిత్యం, హత్య ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. అప్పుడు కూడా రోడ్డుపైకి వచ్చి పోరాటం చేశాను. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని బలంగా కోరుకున్నాను. అయినా మళ్లీ ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయంటే, నిందితుల్లో చట్టం నుంచి తప్పించుకోవచ్చనే ధీమా కారణం కావొచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దారుణానికి పాల్పడిన కిరాతకుడిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నారని పవన్ కల్యాణ్ వెల్లడించారు. నిందితుడికి అత్యంత కఠినంగా శిక్ష పడేలా చూడాలని, భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక చర్యలకు పాల్పడాలంటేనే భయం పుట్టేలా చర్యలు తీసుకోవాలని న్యాయశాఖ, పోలీస్ శాఖ ఉన్నతాధికారులను, డీజీపీని, హోంశాఖ మంత్రి అనిత గారిని ఆయన కోరారు. చిన్నారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన పవన్ కల్యాణ్, నిందితులకు కఠిన శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. చిన్నారులపై జరుగుతున్న ఇలాంటి అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయడానికి సమాజం మొత్తం మేల్కోవాల్సిన అవసరం ఉందని, దోషులకు కఠిన శిక్షలు విధించడం ద్వారానే భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలను నివారించగలమని ఆయన అభిప్రాయపడ్డారు.

## టీడీపీ.. తెలుగు డ్రామా పార్టీ: వైఎస్ జగన్

మొదటి పేజి తరువాయి

143 హామీలను పూర్తిగా పక్కనపెట్టారు.చిన్నహామీ అయిన ఉచిత బస్సుకోసం కూడా ప్రజలు ఎదురుచూస్తున్నారు. గ్యాస్ సిలెండర్లు కూడా సరిగ్గా ఇవ్వలేకపోయారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువులు అటకెక్కాయి. సీబీఎస్ఈ, టోఫెల్, నాడు-నేడు, పిల్లలకు ట్యాబులు అన్నీ ఆగిపోయాయి. మా హయాంలో ప్రతి మూడు నెలలకూ ఫీజు రియింబర్స్‌మెంట్ ఇచ్చేవాళ్లం. కూటమి ప్రభుత్వంలో అమ్మ ఒడికి పంగనామాలు పెట్టారు. ఫీజు రియంబర్స్‌మెంట్, వసతి దీవెన లేదు. చదివించలేక పిల్లలను పనులకు పంపే పరిస్థితులు కనిపిస్తున్నాయి... ఆరోగ్య శ్రీనికూడా పూర్తిగా నిర్వీర్యం చేశారు. పేషెంట్లకు ఆరోగ్య శ్రీ అందని పరిస్థితి నెలకొంది. పేదలు వైద్యంకోసం అప్పులు పాలు అవుతున్నారు. చంద్రబాబు పాలనలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ఏడాది కాలంగా రైతు భరోసా లేదు. ధాన్యం సహా ఏ పంటకూ కనీస మద్దతు ధరలు రావడంలేదు. ధాన్యానికి కనీస మద్దతు ధరే కాదు, జీఎల్టీ రూపంలో ప్రతి ఎకరాకు రూ.10వేలు అదనంగా రైతుకు వచ్చేది. మిరప, పత్తి, చీనీ, టమోటో.. పొగాకు.. ఇలా ఏ పంట తీసుకున్నా రైతులకు ధరలు రాడంలేదు. రైతు బతుకు దళారీ పాలయ్యింది:.. ఏడాది కాలంలో ఒక్క ఉద్యోగంకూడా ఇవ్వలేకపోయారు. ఉన్న ఉద్యోగాలూ పీకేస్తున్నారు. 2.6 లక్షల మంది వాలంటీర్లు, 15వేల మంది బెవరేజెస్ కార్పొరేషన్లు, రేషన్ వాహనాల మీద ఆధారపడ్డ 20వేల మంది ఇలా మొత్తంగా 3లక్షల ఉద్యోగాలను తీసేశారు. మన పాలనలో ఉద్యోగస్తుల్లో చంద్రబాబు విషం నింపారు. ఇప్పుడు ఒక్కరికీ ఐఆర్ ఇచ్చిన పాపాన పోలేదు, పీఆర్‌సీ లేదు. మూడు డీఏలు పెండింగ్, బకాయిలు పెండింగ్. చంద్రబాబును ఎందుకు తెచ్చుకున్నామని ఉద్యోగులు తలపట్టుకుంటున్నారు. ఏ వర్గం కూడా సంతోషంగా లేదు. ఇసుక, మట్టి, సిలికా, క్వార్ట్జ్, రాజధాని పనులు.. లిక్కర్ ఇలా దేన్నీ వదలకుండా దోచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మనం రూ.2.73లక్షల కోట్లు డీబీటీ చేశాం. జగన్ చేశాడు, ఇప్పుడు చంద్రబాబు ఎందుకు చేయలేకపోతున్నాడు. మరణం తర్వాత ప్రతి ఇంట్లో నేను బతికే ఉండాలని ఆశపడ్డాను. అందుకే నేను ఇచ్చిన మాట నిలబెట్టుకోగలిగాను. కానీ చంద్రబాబు బటన్ నొక్కడంలేదు, దోచేసుకోవడం, దోచేసినది పంచేసుకోవడం చేస్తున్నాడు. రాష్ట్రానికి వచ్చిన ఆదాయాలు కూడా తగ్గిపోయాయి. దేశం మొత్తం 11 శాతం పెరిగితే.. మనకు 3శాతం పెరిగాయి. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు టీడీపీకి చెందిన గజ దొంగల ముఠా జేబుల్లోకి పోతోంది" అని జగన్ అన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు

మొదటి పేజి తరువాయి

వ్యవసాయ రంగానికి కొత్త ఆశలు రేకెత్తిస్తూ ఈ పవనాలు రాష్ట్రమంతటా ఆవరించాయి. మే 26న రాయలసీమలోకి ప్రవేశించిన నైరుతి, ఈరోజు (మే 28) నాటికి ఆంధ్రప్రదేశ్ మొత్తం విస్తరించినట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారికంగా వెల్లడించింది. సాధారణంగా జూన్ 4వ తేదీ ప్రాంతంలో రాష్ట్రంలోకి ప్రవేశించే రుతుపవనాలు ఈసారి తొమ్మిది రోజులు ముందుగానే పలకరించడం విశేషం. 2009 సంవత్సరం తర్వాత ఇంత త్వరగా రుతుపవనాలు రావడం ఇదే తొలిసారని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అరేబియా సముద్రంలోని వాతావరణ పరిణామాలు, భూమధ్యరేఖ మీదుగా వీస్తున్న గాలులు బలపడటమే ఈ ముందస్తు రుతుపవనాలకు కారణమని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) విశ్లేషిస్తోంది. దేశవ్యాప్తంగా కూడా 2025లో రుతుపవనాల కదలిక వేగంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ సకాల వర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు ఈ వర్షాలు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పలుచోట్ల రైతులు వరి నారు నాటుతున్న చిత్రాలు సోషల్ మీడియాలో కనిపిస్తుండటం, వ్యవసాయ వర్గాల్లో నెలకొన్న కొత్త ఉత్సాహానికి నిదర్శనంగా నిలుస్తోంది. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

## లిక్కర్ స్కామ్... జైల్లో ఉన్న రాజ్ కసిరెడ్డిని విచారిస్తున్న ఈడీ అధికారులు



**అమరావతి,:** మద్యం కుంభకోణం ఏపీ రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్న సంగతి తెలిసిందే. మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తమ దర్యాప్తును ప్రారంభించారు. ఈ కేసులో కీలక వ్యక్తిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి (కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి)ని విచారించేందుకు ఈ ఉదయం ఈడీ అధికారులు విజయవాడ జిల్లా జైలుకు చేరుకున్నారు. రాజశేఖర్ రెడ్డి నుంచి వాంగ్మూలం నమోదు చేసుకునేందుకు ఈడీ అధికారులు ఇప్పటికే కోర్టు నుంచి అనుమతి పొందారు. మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన సొమ్మును ఎలా దారి మళ్లించారు, ఈ నగదు ఎవరెవరి చేతులు మారింది, ఎప్పుడెప్పుడు ఈ లావాదేవీలు జరిగాయి అనే అంశాలపై ఈడీ అధికారులు రాజ్ కసిరెడ్డిని ప్రధానంగా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిన్న ఈడీ బృందం, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులతో సమావేశమైంది. కేసు పూర్వాపరాలను సిట్ అధికారులు ఈడీకి వివరించారు. ఇకపై ఈ కేసు విచారణలో పరస్పరం సహకరించుకోవాలని ఇరు దర్యాప్తు సంస్థలు నిర్ణయించుకున్నాయి. మద్యం కుంభకోణంలో ఏ-1 నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డితో పాటు ఇతర నిందితులు, మద్యం వ్యాపారులు, కొందరు మాజీ అధికారులు సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా, ఈ అక్రమ లావాదేవీల ద్వారా వచ్చిన ముడుపులు చివరకు ఎవరికి చేరాయనే విషయంపై ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఈ అంచనాలను బలపరిచేందుకు పక్కా ఆధారాలను సేకరించాల్సి ఉందని అధికారులు భావిస్తున్నారు. రాజ్ కసిరెడ్డి ఏర్పాటు చేసుకున్న క్యాష్ హ్యాండ్లర్ల ద్వారా వసూలైన డబ్బు ఎన్ని దశలు దాటి, ఎవరికి చేరిందనే విషయంపై ఇటీవల అరెస్టు చేసిన ముగ్గురు కీలక వ్యక్తుల విచారణలో మరిన్ని వివరాలు బయటపడినట్లు సమాచారం. గత ఐదేళ్ల పాటు తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా చక్రం తిప్పారని ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఓఎస్‌డీగా పనిచేసిన కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ గోవిందప్పలను సిట్ అధికారులు ఇప్పటికే విచారించారు. సిట్ సేకరించిన ఈ వివరాల ఆధారంగా ఈడీ తన దర్యాప్తును ముందుకు తీసుకెళ్లనుంది.

# మహానాడు వేదికపై ఎన్టీఆర్ కు చంద్రబాబు నివాళి

మొదటి పేజి తరువాయి

పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించిన నాయకుడు ప్రపంచంలో ఎన్టీఆర్ మాత్రమేనని చంద్రబాబు చెప్పారు.

పదవికి కొత్త భాష్యం..

అధికారం అంటే బాధ్యత అని, పదవి అంటే సేవ చేసే అవకాశమని, పాలకులు అంటే సేవకులని చెప్పి దేశ రాజకీయాల అర్థాలే మార్చిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. సాధారణ ప్రభుత్వ ఉద్యోగి స్థాయి నుంచి తెలుగు సినీరంగంలో ఎవరెస్టుగా ఎదగడం, ప్రజల కోసం పార్టీ పెట్టి ముఖ్యమంత్రి కావడం అనితర సాధ్యమని, మన కళ్లముందు కనిపించిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని చెప్పారు. ఎన్టీఆర్ జీవితమేమీ పూలపాన్పు కాదని, నిరంతరం పోరాటాలతోనే ఆయన ఎదిగారని చెప్పుకొచ్చారు. స్వీయక్రమశిక్షణ, నీతి నిజాయితీ, పట్టుదల ఆయన ఆయుధాలని చంద్రబాబు తెలిపారు.

పసుపు జెండా శాశ్వతం..

43 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ రూపొందించిన పసుపు జెండా దేశ రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని చంద్రబాబు చెప్పారు. ఈ జెండా శాశ్వతంగా ఉంటుందని, తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్టీఆర్ గుర్తుంటారని అన్నారు. సినీ రంగంలో 33 ఏళ్లు, రాజకీయ రంగంలో 13 ఏళ్ల పాటు ఎన్టీఆర్ అద్వితీయ చరిత్ర సృష్టించారని తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహం చూస్తూ ఏ సంకల్పం చేసినా దానిని సాధించే శక్తి, సామర్థ్యం మీకు వస్తుందని చంద్రబాబు వివరించారు.

ఆయన ప్రసంగమే ఓ గర్జన..

చైతన్యరథంపై రాష్ట్రంలో తిరుగుతూ ఎన్టీఆర్ గర్జించారని చెప్పారు. ఎన్టీఆర్ ప్రసంగిస్తుంటే గర్జించినట్లే ఉండేదని గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలో మరెవ్వరికీ సాధ్యం కాని ఘనతలు ఎన్నో ఆయన అలవోకగా సాధించారని చంద్రబాబు కొనియాడారు. ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా అని, యువతకు భవిష్యత్తు అని, కార్మిక లోకానికి అండ అని చెప్పారు. సమాజంలో అన్ని వర్గాలు కీర్తించే ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని చంద్రబాబు పేర్కొన్నారు.

సుపరిపాలనకు ఆద్యులు ఎన్టీఆర్..

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన తో పాలనలో కొత్త ఒరవడికి ఎన్టీఆర్ ఆద్యులుగా నిలిచారని చంద్రబాబు చెప్పారు. పేదవాడికి



పట్టెడన్నం పెట్టాలని రెండు రూపాయలకు కిలో బియ్యం తెచ్చారని, అందరికీ పక్కా ఇళ్లు, బడుగులకు జనతా వస్త్రాలు అందించారని గుర్తు చేశారు. వృద్ధాప్య పెన్షన్లు, రూ.50కే హార్స్ పవర్ విద్యుత్, గురుకుల పాఠశాలల ఏర్పాటు, పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం, మహిళలకు ఆస్తి హక్కు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం... ఇలా సంక్షేమాన్ని-అభివృద్ధిని సమతుల్యం చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేసి, సింగిల్ విండో విధానానికి రూపకల్పన చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు, మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది ఎన్టీఆరేనని గుర్తుచేశారు.

### రాజకీయాల్లోకి రాకముందు కూడా..

ఎన్టీఆర్ నిరంతరం ప్రజల కోసమే ఆలోచించేవారని, రాజకీయాల్లోకి రాకముందు కూడా ప్రజల కష్టాల్లో ఉన్నప్పుడు నేనున్నానంటూ ముందుకొచ్చి సాయం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. 1952 సంవత్సరంలో రాయలసీమలో కరువు వచ్చినప్పుడు,1962లో భారత్ చైనా మధ్య యుద్ధం జరిగినప్పుడు ఎన్టీఆర్ జోలె పట్టి విరాళాలు సేకరించారని చెప్పారు. 1965లో భారత్ పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరిగినప్పుడు, 1972లో రాష్ట్రంలో కరువు వచ్చినప్పుడు, 1977లో దివిసీమ ఉప్పెన సంభవించినప్పుడు... వేల మంది మృత్యువాత పడి, లక్షలాది మంది నిరాశ్రయులైతే ఎన్టీఆర్ స్వయంగా దివిసీమ వెళ్లి సేవా కార్యక్రమాలు చేపట్టారు.

### ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేద్దాం...స్వర్ణాంధ్ర సాధిద్దాం..

ఈ నాలుగు దశాబ్దాల్లో ఎన్నో మైలురాళ్లు దాటొచ్చామని చంద్రబాబు తెలిపారు. ఎన్నో విజయాలు, మరెన్నో అనుభవాలు మూటగట్టుకున్నామని చెప్పారు. ఎన్టీఆర్ ఆశయాలు, సిద్ధాంతాలు ముందుకు తీసుకువెళ్తున్నామని, ఆయన స్ఫూర్తితోనే సంక్షేమానికి, సంస్కరణలకు, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. 2024లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిన పెట్టామని చంద్రబాబు పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం కోసం ఎన్టీఆర్ తపించారని, ఆయన ఆశయ సాధన కోసం పీ4 విధానాన్ని తీసుకువచ్చామన్నారు. దీని ద్వారా జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించి జీవన ప్రమాణాలు పెంచుతామని వివరించారు. పార్టీ సిద్ధాంతాల్లో నూతనత్వాన్ని తెచ్చేందుకు తీసుకొచ్చిన 6 సూత్రాలు గేమ్ చేంజర్ అవుతాయని అన్నారు. ఎన్టీఆర్ ఆశీస్సులతో 2047 నాటికి తెలుగుజాతి ప్రపంచంలోనే నెంబర్ వన్ అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి

**పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి**

**నంచర్ల శ్రీనివాస్ బాబు జ్ఞాపకార్థంగా క్రికెట్ టోర్నమెంట్**

**చింతపట్లలో 120 మంది క్రికెట్ ఆటగాళ్లు**

**-గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం**

**టోర్నమెంటు ముగింపు**



యాచారం సూర్య న్యూస్( మే 28):. గ్రామీణ స్థాయి యువత క్రీడల్లో రాణించాలని పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నంచర్ల శ్రీనివాస్ బాబు జ్ఞాపకార్థంగా ఆర్గనైజర్లు చింతపట్ల ప్రభుత్వ పాఠశాల 1998-99 ఎస్ఎస్సి బ్యాచ్ కి చెందిన నేర్లకంటి నరేష్ సాగర్, బల్గూరి నరసింహ, పెండ్యాల శ్రీనివాస్, సూరం పురుషోత్తం రెడ్డి, దిండి సురేందర్ రెడ్డి,మాదగోని సుధాకర్, పొగాక్ రమేష్, కొండ్రు శివ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించడం జరిగింది. బుధవారం ఈ కార్యక్రమంలో భాగంగా.. సుమారు 18 రోజుల నుండి క్రీడాకారులు 8 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్లో వారియర్స్ టీం, కింగ్స్ టీం హోరా హోరిగా తలపడ్డాయి. మొదటి విజేతగా వారియర్స్ గెలుపొందింది. రన్నర్ గా కింగ్స్ టీం గెలుపొందింది. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి వారియర్స్ టీం కు 20 వేలు, నంచర్ల నగదు అందించారు. రెండవ బహుమతి కింగ్స్ కు 10 వేలు, రాసాల రఘు అందించారు. మూడవ బహుమతి టైగర్స్ టీం కు 5 వేలు, నగదు పెండ్యాల వెంకటేష్ అందించారు. ఈ టోర్నమెంటులో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సిరీస్, 3వేలు నగదు సూరం భాస్కర్ రెడ్డి అందించారు. ఈ టీములకు ముఖ్యఅతిథిగా లిక్కి శ్రీనివాస్ రెడ్డి హాజరై షీల్డ్,





గెలుపొందిన విజేతలకు అందజేశారు. క్రీడాకారులు ప్రతి టీం లో గెలుపు కోసం శ్రమించారని గుర్తు చేశారు. వేసవికాలంలో యువకులు చెడు వ్యసనాలకు పాల్పడకుండా చింతపట్ల గ్రామంలో సుమారు 150 మంది క్రీడల్లో పాల్గొని ఉత్సాహాన్ని ఇచ్చారని అన్నారు. ఈ టోర్నమెంట్ను చూడడానికి వందలాదిమంది క్రీడాకారులను ఆట చూడడానికి ఆసక్తి చూపారు. భవిష్యత్తులో ఇలాంటి క్రీడలు నిర్వహించాలని ఆయన కోరారు. క్రీడలతోపాటు చదువులో ఉద్యోగాలలో, వ్యాపారాలలో స్థిరపడాలని వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో చివరి లబ్దిదారుడికి చేరే వరకు**

# సంక్షేమ పథకాలు అందిస్తాం

**ప్రతి గ్రామం లో ఇందిరమ్మ ఇండ్లను ఇస్తున్నాం**

**అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తాం**

**గత ప్రభుత్వం లో పది సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు.**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్**



(నందిగామ సూర్య న్యూస్ మే 28): రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చాకలి గుట్ట తండా ,రంగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు కు భూమి పూజ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మంజుల తులసి రాం నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు,మాజీ ఎంపీటీసీ కుమారస్వామి గౌడ్,చంద్రపాల్ రెడ్డి,రాజు నాయక్,రమేష్, తోట రాజగోపాల్, రూప్ సింగ్, లక్ష్మణ్ నాయక్ నర్సింలు, వెంకట్ చారి, వేణు, గుబురు నాయక్ దేవేందర్, హనుమంత్ గౌడ్ ,శ్రీను, గణేష్,ఆనంద్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు..



## ఇంద్రమ్మ ఇండ్లు పనులు ప్రారంభం ఎంపీడీవో శైలజ

**లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలి**

**ప్రతి పేదోడికి ఇంద్రమ్మ ఇండ్లు మంజూరు**

**మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్కు నరసింహ**



యాచారం సూర్య న్యూస్ (మే 28):. యాచారం మండలంలో ఇంద్రమ్మ ఇండ్ల పనులను యాచారం ఎంపీడీవో శైలజ, ఎంపీ ఓ శ్రీలత యాచారం నంది వనపర్తి గడ్డ మల్లయ గూడెం చింతపట్ల వివిధ గ్రామాలలో పనులు ప్రారంభించారు. బుధవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... లబ్ధిదారులు ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. లేనియెడల ఇంటి నిర్మాణాన్ని రద్దు చేయడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్క్ నరసింహ మాట్లాడుతూ.. ప్రతి పేదోడికి ఇండ్లు కట్టించే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. మండలంలో227 మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాన్ని పనులు చేపట్టాలని కోరారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇంద్రమ్మ ఇల్లు ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పల భాస్కర్, నాయిని సుదర్శన్ రెడ్డి, జయప్రకాష్, గ్రామ సెక్రెటరీ తిరుపతయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

**ప్రధాన రహదారిపై ముమ్మరంగా వాహనాల తనిఖీ ( స్పెషల్ డ్రైవ్).**

**10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు.**

**చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ముత్యాల రామ్మూర్తి.**




చింతపల్లి,సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 28 : హైదరాబాద్- నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై చింతపల్లి మండలంలోని మాల్, చింతపల్లి ప్రధాన కూడళ్లలో బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించిన చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ముత్యాల రామ్మూర్తి. తనిఖీల్లో భాగంగా ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులు, సరియైన పత్రాలు లేని,నెంబర్ ప్లేట్లు లేని తదితర వాహనాలు తనిఖీలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో 10 మందిపై కేసులు నమోదు చేయబడ్డాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని వాహనంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ జప్తు చేసి జై శిక్ష కూడా విధించవచ్చున్నారు. మైనర్లకు వాహనాలు అప్పగిస్తే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హిదాయత్ అలీ, కానిస్టేబుళ్లు విజయ్ కిరణ్, భాస్కర్, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.




## ఘనంగా ఏన్ టీఆర్ జయంతి వేడుకలు



ఇబ్రహీంపట్నం,సూర్యటుడే న్యూస్ ప్రతినిధి మే28: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జక్కా రామ్ రెడ్డి ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు 102 వ జయంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం చెరువు కట్ట పైన ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చింతకింది చక్రపాణి, బొమ్మ కంటి అశోక్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారుఆట్లాడుతూ వీరాచారి, బుసాని ప్రభాకర్,పేరాల శేఖర్ రావు, కప్పరి అంజయ్య, జరిగే వెంకటేష్ గౌడ్,ఇబ్రహీం, మహేష్, బిక్షాపతి దితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు




**అదుపులోకి ఆర్ ఐ జి. కృష్ణ.**

ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 28: ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం పై బుధవారం ఏసీబీ అధికారులు డిసిపి ఆనంద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్ ఐ కృష్ణ రూ.12 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణ. ఆర్.ఐ కృష్ణ ఆదిభట్ల మున్సిపాలిటీకి చెందిన జమ్మ శంకర్ కు ఆదిబట్ల లోని టిసిఎస్ సమీపంలోని సర్వే నెం. 355 లోని 17 గుంటల భూమి విషయంలో 10 గుంటల భూమి రిజిస్ట్రేషన్ కాగా, మిగతా ఏడు గుంటల భూమి నిషేధిత జాబితాలో లిస్ట్ లో చేర్చారు.కాగా ఏడు గుంటల భూమి విషయంలో గతనాలుగు నెలల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగగా నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీంతో సదరు వ్యక్తి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోగా, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ ఐ రిపోర్ట్ కోరారు. జమ్మ శంకర్ రిపోర్టు కోసం వెళితే, ఆర్ఐ కృష్ణ రిపోర్ట్ కోసం రూ. 12 లక్షలు లంచం డిమాండ్ చేయగా సదరు వ్యక్తి 9 లక్షలకు బేరం కుదుర్చుకుని ఇవ్వలేని పరిస్థితిలో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు పక్కా ఆధారాలు, సమాచారంతో బుధవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం పై దాదాపు మూడు గంటలకు పైగా సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఆర్ ఐ కృష్ణని విచారించారు. బేరం కుదుర్చుకున్న నగదును తనతో పాటు ఉన్నత అధికారులకు కూడ చెందుతుందని తెలిపారు. విచారించిన అనంతరం ఏసీబీ అధికారులు ఆర్ ఐ కృష్ణ అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1064 ను సంప్రదించాలని ఏసీబీ అధికారులు ప్రజలకు సూచించారు. ఫిర్యాది దారుని పేరు, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.



**ఏసీబీ దాడులలో పట్టుబడ్డ**

## ఇబ్రహీంపట్నం రెవిన్యూ ఇన్స్పెక్టర్ జి. కృష్ణ

**షాద్ నగర్ లో తిరంగా ర్యాలీ విజయవంతం**

**పార్టీలకు అతీతంగా త్రివిధ దళాలకు వందనాలు తెలిపిన నాయకులు**




షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే 28): భారత సైనికులు ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసినందుకు బుధవారం షాద్ నగర్ నియోజక వర్గంలోని వివిధ సంఘాలు, న్యాయవాదుల రాజకీయ పార్టీలు బిజెపి, కాంగ్రెస్, తెరాస విశ్వహిందూ పరిషత్,బజరంగ్ దళ్ తదితర సంఘాలు హాజరై పెద్దయెత్తున షాద్ నగర్ చౌరస్తా నుండి ఛత్రపతి విగ్రహ దగ్గర నుండి తిరిగి కాలేజ్ రోడ్ నుండి మళ్లీ చౌరస్తా వద్దకు పెద్ద ఎత్తున పాకిస్తాన్ ఉగ్రవాదుల్లారా కబర్దార్ అంటూ నినాదాలు చేశారు. చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేదికపై బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ బిజెపి షాద్ నగర్ ఇంచార్జ్ అందె బాబయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి విశ్వహిందూ పరిషత్ బండారి రమేష్ డాక్టర్ యూనియన్ నాగవర్ధన్ రిటైడ్ ఆర్మీ శ్రీనివాస్ రెడ్డి హరి భూషణ్ స్వాతంత్ర్య సమర యోధులు నాగిళ్ల గోపాల్ ఆర్య వైశ్య సంఘం మలిపెద్ది శ్రీనివాస్ ,రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ.. ఇది భారత సైనికులు చేసింది యుద్ధం కాదు ఆపరేషన్ అన్న విషయం గుర్తుపెట్టుకోవాలిలని ఆపరేషన్ అంటే దెబ్బ తగిలిన చోటనే ట్రీట్మెంట్ ఇవ్వటం అందుకే ఆపరేషన్ సింధూర్ తో మన భారతీయులను చంపిన పాకిస్తాన్ ఉగ్రవాదులను చంపి భారతసైనికులు విజయం సాధించారని వారు అన్నారు. ఆపరేషన్ సింధూర్ ని భారత్ ప్రధాని నరేంద్ర మోదీ మహిళల చేతిలో పెట్టి పాకిస్తానీ ఉగ్రవాదులు ప్రాణాలను తియ్యటానికి మా దేశ ఆడవాళ్ళ శక్తి చాలు అని నిరూపించాడు అని అన్నారు. అదే కాకుండా హిందూ ముస్లిం బేధాలు లేవు మాకు అని నిరూపించాడు, అని తెలిపారు. ఈ సందర్భంగా త్రివిధ దళాలకు వందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గుప్తా, మురళి చెట్లవెంకటేష్ వంశీ కృష్ణ, ప్యాట అశోక్ కూర్మయ్య మనోహర్ ప్యాట శ్రీకాంత్, శంకర్, మమత,పసుపుల ప్రశాంత్ ముదిరాజ్, కత్తి చంద్రశేఖర్, వరలక్ష్మి యువకులు దేశ భక్తులు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



## కడప మహాసభకు తరలి వెళ్లిన తెలుగుదేశం పార్టీ నాయకులు



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే 28): ఆంధ్ర ప్రదేశ్ కడపలో నిర్వహిస్తున్న తెదేపా కడప మహానాడు చరిత్ర సృష్టించబోతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపు మేరకు.. షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆదేశాల మేరకు షాద్ నగర్ నుండి తెలుగుదేశం సీనియర్ నాయకులు కార్యకర్తలు బయలుదేరారు. చిల్కమర్రి కృష్ణయ్య, విట్యాల రామచంద్రయ్య, నరసింహులు, బండ్లగూడెం బాలరాజ్, రాసు మల్ల గూడెం నరసింహులు, కుడుముల యాదయ్య తదితరులు బయలుదేరారు.

**శ్వేత వివాహానికి పుస్తె మెట్టెలు**

## బహూకరించిన తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి...

**కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే 28): కేశంపేట్ మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామం లో పెళ్లి కూతురు అబ్బీ శ్వేతా వివాహానికి వారి తల్లిదండ్రులు అబ్బీ రత్నయ్య నర్సమ్మలకు గ్రామ తాజా మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి, బంగారు పుస్తె, వెండి మెట్టెలు అందించారు. కార్యక్రమం లో బి ఆర్ ఎస్ గ్రామకమిటి అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జంగయ్య చిన్న రెడ్డి అబ్బీ శ్రీను నిరంజన్ జీ రవి నరేందర్ జి.పాస్టర్ కృష్ణయ్య దామోదర్ యాదయ్య వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**ఈనెల 30న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం**

## ముందు జరిగే ధర్నాని జయప్రదం చేయండి



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 28: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 30న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా ను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం కప్పపహాడ్, ఎలిమినేడు గ్రామాల్లో ఉపాధి పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేదలకు వేసవికాలంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు 4 నుంచి 6 వారాలు పెండింగ్ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పనిచేసిన వారం పూర్తి కాగానే వెంటనే బిల్లులు ఇవ్వాలన్నారు. కొలతల ప్రకారం బిల్లులు రాకపోవడంతో కూలీలు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గడం వల్ల కూలీల జాబ్ కార్డులు, పని దినాలు పెద్ద ఎత్తున తగ్గాయి. రోజు కూలి 307 నిర్ణయించిన కూలీలకు మాత్రం 100 నుంచి 150 కు మించి పడటం లేదు. పనిచేసిన కూలీ డబ్బులు కూడా ఎప్పుడు వస్తాయో తెలియదన్నారు. వారం వారం వేతనాలు చెల్లింపులు లేవు. కొత్త జాబు కార్డులు ఇవ్వడం లేదు. పేస్లిప్పులు ఇవ్వడం లేదు. పని ప్రదేశంలో త్రాగునీరు నీడ కోసం టెంట్, మెడికల్ కిట్టు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. పనిముట్లు ఇవ్వడం లేదు. ప్రమాదం జరిగితే ఆదుకునే నాధుడే లేడని తెలిపారు. రోజు కూలి 600 ఇచ్చి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలి. పట్టణ పేదలకు ఉపాధి పనిని కల్పించాలని ఈ నెల 30న జరిగే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు గణేష్, మండల నాయకులు ప్రభుదాస్, నరసింహ్మా తదితరులు పాల్గొన్నారు.



## షాద్ నగర్ లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే 28): విశ్వ విఖ్యాత నటసార్వభౌముడు స్వర్గీయ మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కీ,శే, నందమూరి తారక రామారావు జయంతి షాద్ నగర్ లోఘనగ, నిర్వహించారు. తెలుగుదేశం సీనియర్ నేత మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం షాద్ నగర్ పట్టణంలో నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న. చల్లా వెంకటేశ్వర్, సీనియర్ నాయకులు ఎల్ కుమార్ గౌడ్. పట్టణ అధ్యక్షుడు ఆనంద్ కుమార్ మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్ తెలుగు యువత ఎం రమేష్. అనంతయ్య శివకుమార్ కృష్ణయ్య కుడుములు యాదయ్య కే శ్రీనివాస్ వేముల ఆంజనేయులు మద్దూరు చెన్నయ్య గణేష్ గౌడ్ నర్సింలు రామచంద్రయ్య నర్సింలు పాల్గొన్నారు.

**తులేకలాన్ లో ఇందిరమ్మ ఇండ్లకు**

## ముగ్గుపోసి నిర్మాణ పనులు ప్రారంభం



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 28 : ఇబ్రహీంపట్నం మండల్ తూలేకలన్(పెత్తుల్ల)గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి నిర్మాణ పనులు ప్రారంభించిన ఇబ్రహీంపట్నం మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోదూరి రమేష్. ఇందిరమ్మ ఇండ్లతో గ్రామాలలో నూతన ఉత్తేజం విలసిల్లుతుందని, గత 10 సంవత్సరాలనుండి బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి కూడా న్యాయం జరగలేదన్నారు. పెత్తుల్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో భాగంగా 37 ఇండ్లు మంజూరు అయ్యాయని, ఇంకా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ఇంకా దాదాపుగా 200 ఇండ్లు అవసరం ఉన్నాయన్నారు. కనుక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో లబ్ధిదారులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించడం జరుగుతుందనన్నారు. ప్రజల అధైర్యపడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శశాంక్ రెడ్డి, కోదూరి పండు, కలకొండా కృష్ణ,యాదగిరి,నర్సింహ్మా,మహేందర్, బన్నీ ,వెంకటేష్, పండు, ప్రభు, సాయి, నర్సింహ్మా పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు..

### జూన్ 2న కవిత కొత్త పార్టీ..?



**హైదరాబాద్, :** మెదక్ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత ఎపిసోడ్ ని ఫ్యామిలీ డ్రామాతో పోల్చారు. తెలంగాణలో దేవుళ్ళు ఉన్నారా దెయ్యాలు ఉన్నాయా అన్న విషయంపై చర్చ జరుగుతుంది.. దేవుడి పక్కన దెయ్యం ఉంటే 12 ఏళ్లుగా ఏం చేస్తున్నారు అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని వాళ్లే నాటకం ఆడుతున్నారు.. ఒకరితో గొడవ పడితే మరొకరి దగ్గరికి పోయేలా గ్రూపులు క్రియేట్ చేస్తున్నారు.. మాట్లాడుకోవాలంటే తండ్రి, కూతురి మధ్య మధ్యవర్తి ఎందుకు వస్తారు అని అడిగారు. నా రాజకీయ పరిజ్ఞానం ప్రకారం కవిత సొంత పార్టీ పెట్టాలని ఫిక్స్ అయ్యింది.. జూన్ 2వ తేదీన కవిత కొత్త పార్టీ పెట్టవచ్చు.. తర్వాత పాదయాత్ర చేయొచ్చు అని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. అయితే, బీఆర్ఎస్ పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న వ్యవహారాలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఇంతకు ముందు కూడా కామెంట్ చేశారు. కవిత కాంగ్రెస్ లోకి వెళ్తుందని.. వైఎస్ షర్మిళ తరహాలోనే కవిత కూడా పార్టీ నుంచి బయటకు వస్తుందని గతంలో వ్యాఖ్యానించారు. ఈ సారి ఏకంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే కవిత పార్టీ పెడుతుందని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేయడంతో.. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఏదైనా స్పష్టమైన సమాచారంతో ఆ కామెంట్స్ చేశారా లేక రాజకీయ విమర్శల్లోనే భాగమా అనేది రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీ కవిత తీసుకోబోయే నిర్ణయాన్ని బట్టి అర్ధమవుతుంది.

## పేదరికం లేని సమాజం టీడీపీ లక్ష్యం..
## భవిష్యత్తు కోసం ఆరు శాసనాలు!



**అమరావతి,:** తెలుగు జాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ టీడీపీ అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పేదరికం లేని సమాజం టీడీపీ లక్ష్యం అని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో కూడా మార్పు రావాలని, మహానాడు వేదికగా మరో 40 సంవత్సరాలు పార్టీ నడపడానికి కావలసిన అంశాలపై చర్చించాలన్నారు. ఎత్తిన పసుపు జెండా దించకుండా కార్యకర్తలు పార్టీకి కాపలా కాశారని, ప్రతి కార్యకర్తకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా అంటూ మంత్రి లోకేశ్ చెప్పారు. కడప గడ్డపై జరుగుతున్న టీడీపీ మహానాడులో మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. 'తెలుగు జాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ టీడీపీ. పేదల కడుపు నిండా భోజనం పెట్టిన పార్టీ తెలుగుదేశం. తెలుగుజాతి ఆత్మగౌరవం, అన్నదాతకు అండ టీడీపీ. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన ముహూర్తబలం చాలా గట్టిది. పేదరికం లేని సమాజం టీడీపీ లక్ష్యం. 58 మంది మొదటిసారిగా గెలిచిన ఎమ్మెల్యేలు ఉన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 మంది కొత్త ఉపాధ్యాయులు రాబోతున్నారు. గత ప్రభుత్వంలో అసెంబ్లీ సాక్షిగా తల్లులను అవమానించారు. సొంత తల్లి చెల్లిని మెడపెట్టి గెంటేశారు. అర్థమైందా రాజా అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. టీడీపీకి ప్రతిపక్షం కొత్తకాదు.. అధికారం కొత్తకాదు' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. భవిష్యత్తు కోసం ఆరు శాసనాలను ప్రతిపాదిస్తున్నా అని మంత్రి తెలిపారు.

## పహల్గామ్‌కు ప్రతిస్పందనగా
## 22 నిమిషాల్లోనే పాక్‌కు బుద్ధి చెప్పాం



**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్ర దాడికి ప్రతిస్పందనగా 22 నిమిషాల్లోనే దాయాది దేశం పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పినట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రధాని మోడీ గుజరాత్‌లో రెండో రోజు పర్యటిస్తున్నారు. గాంధీనగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిపక్షాలు రుజువులు అడుగుతున్నాయని.. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్(పీవోకే)లో తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను కేవలం 22 నిమిషాల్లోనే ధ్వంసం చేసినట్లు తెలిపారు. గతంలో చేసిన వైమానిక దాడులపై కూడా విపక్షాలు అనుమానాలు వ్యక్తం చేశాయని.. కానీ ఈసారి మాత్రం ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాదులను అంతం చేసినట్లు చెప్పారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం భారత్ పలు కఠిన నిర్ణయాలు తీసుకుంది. పాక్‌కు సింధు జలాలు నిలిపేసింది. వీసాలను రద్దు చేసింది. అటారీ సరిహద్దు నిలిపేసింది. అనంతరం మే 7న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. భారత్ జరిపిన దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అలాగే పాకిస్థాన్‌లో పలు వైమానిక స్థావరాలు దెబ్బతిన్నాయి. అనంతరం పాకిస్థాన్ కాళ్లు బేరానికి రావడంతో భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. ఉగ్రవాదాన్ని ఆయుధంగా ఉపయోగించుకుని భారత్‌పై పాకిస్థాన్ యుద్ధం చేస్తుందన్నారు. అందుకే భారత్ నుంచి ఉగ్రవాద ముల్లును తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 75 ఏళ్లుగా ఉగ్రవాదులు దాడులు చేస్తూనే ఉన్నారు. ఇలా భరిస్తూనే ఉండాలా? అందుకే పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టినట్లు తెలిపారు. భారత్.. శాంతిని నమ్ముతుందని.. కానీ పదే పదే రెచ్చగొడితే మాత్రం.. తిరిగి దాడికి చేయడానికి భారత్ వెనుకాడదని హెచ్చరించారు. భారత్ కూడా యోధుల భూమి అని ప్రపంచానికి గుర్తు చేయాలన్నారు.

## అందుకే పాకిస్తాన్‌కు భారత్ తిరిగి సమాధానం చెప్పాల్సి వచ్చింది!




**అమరావతి,:** పహల్గాం దాడిలో ఉగ్రవాదులు ఏ మతం వారో అడిగి మరీ చంపడంతో సహనం పూర్తిగా పోయిందని, అందువల్లే పాకిస్తాన్‌కు భారత్ తిరిగి సమాధానం చెప్పాల్సి వచ్చిందని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. భారతదేశం 1947 నుండి సరిహద్దు ఉగ్రవాదంతో బాధపడిందన్నారు. భారతదేశాన్ని మరింతగా బాధపెట్టకుండా పాకిస్తాన్ వెనక్కి తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ పాక్ పౌరులను లక్ష్యంగా చేసుకోలేదని, ఉగ్రవాద శిబిరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంది అని పురంధేశ్వరి చెప్పారు. పారిస్‌లోని భారతీయ ప్రవాసులను ఉద్దేశించి భారతదేశ అఖిలపక్ష ప్రతినిధి బృందం సభ్యురాలు పురందేశ్వరి ప్రసంగించారు. దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ 'భారతదేశం 1947 నుండి 2025 ఏప్రిల్ 22 వరకు సరిహద్దు ఉగ్రవాదంతో చాలా కాలం బాధపడింది. దేవుడు అనుమతించడు, ఇది కొనసాగాలని మేము కోరుకోవడం లేదు. భారతదేశాన్ని మరింతగా బాధపెట్టకుండా పాకిస్తాన్ వెనక్కి తగ్గడం లేదు. 2014కి ముందు ఉగ్రవాదులు వచ్చి భారత పౌరులపై దాడి చేశారు. భారత్ బాధ్యతాయుతమైన దేశంగా ఉంది. భారత్ ఎప్పుడూ యుద్ధం చేయలేదు, ఇది పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదం. పహల్గాం దాడిలో ఉగ్రవాదులు ఏ మతం వారో అడిగి మరీ చంపడంతో సహనం పూర్తిగా పోయింది. అందువల్లే భారత్ వారికి తిరిగి సమాధానం చెప్పాల్సి వచ్చింది. భారత్ అక్కడి పౌరులను లక్ష్యంగా చేసుకోలేదు. ఉగ్రవాద శిబిరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంది. పొరుగుదేశం పాకిస్తాన్ మాత్రం భారత్ పౌరులను, మిలిటరీని టార్గెట్ చేసి దాడులు చేసింది' అని అన్నారు.

## ఆనంద ద్వీపం.. అయ్యో పాపం!

### కిన్నెరసాని జలాశయం మధ్యలో ఆనంద ద్వీపం

### మంత్రులు, కలెక్టర్లు పరిశీలించినా అభివృద్ధికి దూరమే

### ఫలితంగా దూరం నుంచే పర్యాటకులు వీక్షించాల్సిన దుస్థితి



పాల్వంచ రూరల్: ప్రకృతి అందాలకు నెలవైన కిన్నెరసాని పర్యాటక అభివృద్ధికి నోచుకోవడం లేదు. మంత్రులు, కలెక్టర్లు ప్రత్యక్షంగా పరిశీలించినా అడుగు కూడా ముందుకు పడడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని పర్యాటకంగా అభివృద్ధి చెందకపోవడంతో ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతోంది. నిత్యం వందల సంఖ్యలో, సెలవు రోజుల్లో వేలాదిగా వచ్చే పర్యాటకులు రిజర్వాయర్ మధ్యలోని ఆనంద ద్వీపాన్ని సందర్శించాలని తపన పడుతుంటారు. కానీ అక్కడ చేయాల్సిన అభ్రివృద్ధి పనుల్లో ముందడుగు పడకపోవడంతో అద్భుత అవకాశాన్ని కోల్పోతున్నారు.

### ముగ్గురు మంత్రులు వీక్షించినా..

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏడాది క్రితం కిన్నెరసానిని సందర్శించారు. రిజర్వాయర్ మధ్యలోని ఆనంద ద్వీపం అద్భుతంగా ఉందని, పర్యాటకులకు దర్శనభాగ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అద్దాల మేడ, కాటేజీ పనులు వేగవంతం చేయాలని, పర్యాటకులను ఆకర్షించేలా ఆనంద ద్వీపాన్ని తీర్చిదిద్దాలని అటవీశాఖను ఆదేశించారు. ప్రభుత్వం కూడా ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించడంతో కలెక్టర్ కిన్నెరసానిపై ప్రత్యేక దృష్టి సారించినా, పనులు మాత్రం మందకొడిగానే సాగుతున్నాయి.

### పర్యాటకులకు నిరాశే..

చూడచక్కని ప్రకృతి అందాలు, అద్భుతమైన హైల్యాండ్స్, అందమైన జలాశయం, ఆహ్లాదకరమైన అడవులు ఉన్న కిన్నెరసానిలో సౌకర్యాలు లేక పర్యాటకులకు నిరాశే మిగులుతోంది. అద్దాలమేడ, కాటేజీలు, హారిత హోటల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతారు.


### పదేళ్ల క్రితమే నిధులు మంజూరు

కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు 2015లో నీతి అయోగ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేశాయి. ఆ నిధులతో కొత్తగూడెం క్రాస్ వద్ద హరిత హోటల్, కిన్నెరసానిలో పది కాటేజీలు, అద్దాలమేడ, ఫుడ్‌కోర్టు పనులు చేపట్టాలని నిర్ణయించారు. కాగా, ఇందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో సౌకర్యాల లేమితో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నా.. వసతులు ఉంటే మరింత మంది వచ్చే అవకాశం ఉంది.

### సింగపూర్ నుంచి ఆర్కిటెక్ట్‌లు..

రిజర్వాయర్ మధ్యలో ఉన్న ఆనంద ద్వీపాన్ని అభివృద్ధి చేసేందుకు 2018లో అప్పటి కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ సింగపూర్ నుంచి ప్రత్యేకంగా ఆర్కిటెక్ట్‌లను పిలిపించారు. పర్యాటకుల సౌకర్యార్థం వెదురు బొంగులతో గుడారాలు, ఎత్తయిన ట్రాక్, తాగునీటి వసతి వంటివి కల్పించాలని నిర్ణయించారు. అయితే అవి నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత కలెక్టర్లు ఎంవీ రెడ్డి, అనుదీప్‌తోపాటు ప్రస్తుత కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కూడా పనులను పరిశీలించినా ఫలితం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లక్నవరంలో ఏర్పాటు చేసినట్టుగా ఆనంద ద్వీపం వరకు తీగలవంతెన ఏర్పాటు చేసి, హోటళ్లు, వసతి గృహాలను నిర్మిస్తే పర్యాటకుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముంది.

## ముందస్తు నైరుతి ఎందుకంటే..!



రుతుపవనాల రాక కోసం కర్షకుడు ఆకాశంకేసి కళ్లు కాయలు కాచేలా చూస్తాడు. హలధారితో దోబూచులాడే రుతుపవనాలు ఈసారి రైతన్నలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూ ఆగమేఘాల మీద దూసుకొచ్చి వర్షాలను దంచికొడుతున్నాయి. అడవుల నరికివేత, యథేచ్ఛగా సాగుతున్న మానవ కార్యకలాపాలు, శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం తదితరాలతో వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ సంభవించిన కారణంగానే రుతుపవనాలు ఇలా ముందుగా వచ్చేశాయని ఎన్నో విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే ఇలా ముందస్తు వర్షాలు గతంలో సర్వసాధారణమని వాదించే వాళ్లూ ఉన్నారు. దీంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ముందస్తు రాకకు కారణాలేంటి అనే దానిపై ఇప్పుడు చర్చ మొదలైంది.

### గతంలోనూ ముందొచ్చాయి

కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో నైరుతి రుతుపవనాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఊరకే రాష్ట్రాలను చుట్టేయకుండా భారీ వర్షాలతో పలకరించి ఈసారి అధిక వర్షాలు ఖాయమని కబురును రుతుపవనాలు మోసుకొచ్చాయి. అయితే ఇలా ముందస్తు రాక కొత్తేమీ కాదని గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఈసారి పలు రాష్ట్రాల్లోకి రెండు వారాల ముందే రుతుపవనాలు ప్రవేశించడంతోపాటు కేరళ నుంచి మహారాష్ట్రదాకా అవి వేగంగా, విస్తారంగా మే 24న ఒక్కరోజులోనే విస్తరించడం విశేషం. ఇది అసాధారణమేమీ కాదని, కేవలం అరుదైన విషయమని గణాంకాలు చాటుతున్నాయి. 1971 ఏడాదిలోనూ రుతుపవనాలు కర్ణాటకలో అధిక భాగం, మహారాష్ట్రలో కొంత మేర ఒకేసారి విస్తరించి అప్పుడు అందర్నీ విస్మయానికి గురిచేశాయి. మళ్లీ దాదాపు యాభై ఏళ్ల తర్వాత ఇదే తరహాలో రుతుపవనాలు ఒకేసారి విస్తరించాయి.

### ఆ తర్వాత కాస్తంత బ్రేక్

జూన్ రెండో తేదీదాకా రుతుపవనాలు ఇదే వేగంతో విస్తరిస్తాయని వాతావరణ శాఖ వర్గాలు అంచనావేస్తున్నాయి. మహారాష్ట్ర, తూర్పు భారతాన్ని త్వరగా చుట్టుముట్టాక వేగం తగ్గే వీలుంది. గతంలో మాదిరే వేగం నెమ్మదించి మెల్లిగా రుతుపవనాలు ముందుకు సాగనున్నాయి. మధ్య స్థాయి ఎత్తులో పొడి వాతావరణం ఏర్పడటంతో జూన్ మొదటి వారం తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. తరచూ వర్షాలు పడే అవకాశాలు సన్నగిల్లుతాయి. రుతుపవనాల గమన వేగం సైతం తగ్గనుంది.

### ముందస్తుపై వాతావరణ మార్పుల ప్రభావం

సహజ వాతావరణ వ్యవస్థతోపాటు మానవ ప్రేరేపిత భూతాపోన్నతి, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు వంటి అంశాలూ రుతుపవనాలపై ప్రభావం చూపిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతానికైతే భారత్‌లో రుతుపవనాల రాకపై వాతావరణ మార్పుల ప్రభావం పరిమిత స్థాయిలోనే ఉందని వారు అభిప్రాయపడ్డారు. భూతాపోన్నతి దెబ్బకు యురేసియా, హిమాలయ ప్రాంతాల్లో మంచు దుప్పటి కరిగిపోతోంది. 1990-2020 కాల సగటుతో పోలిస్తే ప్రస్తుతం యురేసియా, హిమాలయాల పరిధిలో మంచు 15 శాతం అంతరించిపోయింది. తక్కువ మంచు కారణంగా ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీంతో రుతుపవనాలు ప్రేరేపితమై త్వరగా వస్తాయి. ఒక్కోసారి మే నెల మధ్యలోనే ఇవి రావొచ్చు. గ్లోబల్ వార్మింగ్‌లో పెరిగే ప్రతి ఒక్క డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతకు సముద్రాలపై వాతావరణంలో తేమ 6-8 శాతం పెరుగుతుంది. పారిశ్రామిక విప్లవానికి ముందునాటితో పోలిస్తే 2025లో ఉష్ణోగ్రత 1.2 డిగ్రీ సెల్సియస్ పెరిగిందని ఇప్పటికే గణాంకాలు చాటుతున్నాయి. ఈ నేపథ్యంలో అరేబియన్ సముద్రం, బంగాళాఖాతం ఉపరితల వాతావరణంలో తేమ పెరిగి మే నెలలోనే మేఘాల అధిక ఆవిర్భావానికి దారితీసింది. కర్ణాటక%-%గోవా తీరం వెంట ద్రోణి కారణంగా తుపాను పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇవి ఈసారి రుతుపవనాలను మరింత ముందుకు లాగాయి. మారిషస్, మడగాస్కర్‌ల మధ్య తక్కువ ఎత్తులో వీచే పవనాల దృగ్విషయాన్ని సోమాలీ జెట్‌గా పిలుస్తారు. ఇది ఈనెలలోనే విజృంభించింది. ఈ గాలులు అరేబియా సముద్రం మీదుగా భారత పశ్చిమ తీరం వైపు వీస్తాయి. ఇవి కేరళ, కర్ణాటక, గోవా, మహారాష్ట్రలనూ తాకుతాయి. ఈసారి సోమాలీ జెట్ గాలుల ప్రభావం తోడవడంతో నైరుతి పవనాలు త్వరగా వచ్చేశాయి.

### మరెన్నో కారణాలు..

భౌగోళిక, సముద్ర, వాతావరణ పరిస్థితుల మధ్య సమన్వయంలో తేడా సైతం ఈసారి రుతుపవనాల ఆగమనాన్ని ముందుకు తోసింది. భూమధ్యరేఖ జోన్‌లో ప్రతి 30 నుంచి 60 రోజులకు ఒకసారి సముద్రజలాల మీదుగా మేఘాలు, వర్షాలు, పవనాలు ఒక క్రమపద్ధతిలో ముందుకు సాగుతాయి. దీనినే మేడిన్ జూలియన్ ఆసిలేషన్(ఎంజేఓ)గా పిలుస్తారు. ఎంజేఓ అనేది రుతుపవనాల్లో తేమ, పొడి దశలను నిర్దేశిస్తుంది. ఈనెలలో ఎంజేఓ మూడో దశలోఉంది. ఇది మేఘావృత స్థితిని అధికం చేసి దక్షిణభారతంలో వర్షాలను కురిపిస్తుంది. మే 25వ తేదీన ఇది నాలుగోదశకు మారడంతో హిందూ సముద్రం నుంచి మరింత తేమ పవనాల రూపంలో భారత్‌పై కురిసింది. ఈసారి ఎల్‌నినో సైతం తటస్థ వైఖరిని ప్రదర్శించడంతో రుతుపవనాలకు అనుకూల వాతావరణం ఏర్పడింది. అందుకే ఈసారి వర్షాలు ముందే పడ్డాయి.

## 'ముంబై' చెప్తున్నదేమిటి?!



'కుండపోతలతో వస్తున్నాం... కాచుకోండ'న్నట్టు హెచ్చరిస్తూ ప్రవేశించాయి నైరుతి రుతుపవనాలు. సోమవారం వేకువజామునే కళ్లు తెరిచిన ముంబై మహానగరవాసులు... వస్తూనే తడాఖా చూపించిన భారీ వర్షాన్ని చూసి బిత్తరపోయారు. సాధారణ సమయాల్లో గంభీరంగా, కళ్లు చెదిరేలా కనబడే మన నగరాలు చినుకు రాలితే ఎంత అల్లకల్లోలమవుతాయో మొన్నీ మధ్యే బెంగళూరు నగరం కూడా నిరూపించింది. మన్నూ మిన్నూ ఏకమైనట్టు ధారాపాతంగా రాత్రంతా కురియటంవల్ల 200 మిల్లీ మీటర్లు(ఎంఎం) మించిన వర్షపాతంతో ముంబై నగరం తాజాగా తడిసిముద్దయింది. ఆ నగరానికి ముందుగా జారీచేసిన 'యెల్లో అలెర్ట్'ను కాస్తా 'రెడ్ అలెర్ట్'గా సవరిస్తూ, ముంబైతోపాటు దాని ఇరుగుపొరుగునున్న జిల్లాల్లో సైతం పిడుగులతో, పెనుగాలులతో అత్యంత భారీ వర్షం ముంచుకు రాబోతున్నదని భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. ముంబై పొరుగునున్న కొలాబాలో సోమవారం 295 ఎంఎం వర్షపాతం నమోదై, 107 ఏళ్లనాటి... అంటే 1918 నాటి రికార్డు 279.4 ఎంఎంను అధిగమించింది. ఇంకా కర్ణాటకలోని మంగళూరు నగరం, దక్షిణ కన్నడ జిల్లాలు సైతం భారీవర్షాలతో ఇక్కట్లుపడ్డాయి. కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు పది రోజులకు మహారాష్ట్ర రావాల్సి వుండగా కేవలం 24 గంటల్లో అక్కడికి లంఘించాయి. ముంబైకి ఆ మర్నాడే చెప్పాపెట్టకుండా వచ్చాయి. సరిగ్గా అయిదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్స్ విభాగం ఒక ఆసక్తికర ప్రకటన చేసింది. ప్రతియేటా అంతక్రితంతో పోలిస్తే భారీ వర్షాలు నమోదవుతున్నాయన్నదే దాని సారాంశం. ఇలాంటి ప్రకటనలు మన పాలకుల్ని అప్రమత్తుల్ని చేయాలి. ఏటా నగరాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలి. వాటి వికేంద్రీకరణకు ప్రణాళికలు రూపొందించాలి. కానీ తరచు నడుంలోతు నీళ్లల్లో మునకలేస్తున్న నగరాలను చూస్తుంటే వారికంత శ్రద్ధ, తీరిక లేవన్న సంగతి తెలుస్తుంది. శతాబ్దం కిందట లేదా అంతకు చాలాముందు నుంచీ ప్రధాన నగరాలుగా వున్నవాటిపై ఎటూ శ్రద్ధ లేదు. కనీసం కొత్తగా నిర్మిస్తున్న నగరాలపైన అయినా ముందుచూపుతో వ్యవహరిద్దామన్న జ్ఞానం లేదు. నిరుడు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 9 వరకూ దశాబ్దకాలంలో ఎన్నడూ లేని విధంగా కుండపోత వర్షాలు విజయవాడ నగరంలో కొంత భాగాన్ని ముంచెత్తడంతోపాటు అమరావతిని కూడా వరదలు అస్తవ్యస్తం చేశాయి. దాని పరిధిలోని 29 గ్రామాల్లో 25 నిండా నీళ్లల్లో మునిగాయి. సాక్షాత్తూ సీఎం చంద్రబాబే అక్రమంగా వుంటున్న తన కరకట్ట నివాసాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ తదితర సంస్థలు మూతపడాల్సి వచ్చింది. లక్షలాదిమంది ప్రజలు సకాలంలో సాయం అందక ఇబ్బందులు పడ్డారు. విజయవాడలో 35 మంది మరణించారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ చెప్పినా మొండి వైఖరితో అమరావతికి పూనుకోవటమే తప్పనుకుంటే ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీని మళ్లీ పిలిచి అట్టహాసంగా సభ చేసి పనులు మొదలుపెట్టారు. అమరావతి ప్రాంత నేల స్వభావం తెలియకపోతే పోయింది... కనీసం కేంద్రీకృత నగరాల వల్ల కలిగే ముప్పును చూస్తూ కూడా వేలకోట్లు కుమ్మరిస్తున్నారంటే ఏమనుకోవాలి? 'ప్రకృతి వైపరీత్యాలు నిజమైన అర్థంలో ప్రకృతి కల్పిస్తున్న వైపరీత్యాలు కాదు. అవి మనిషి రూపొందించే విధానాల వైఫల్యం' అంటాడు అమెరికన్ దౌత్య నిపుణుడు జాన్ బోల్టన్. కుంభవృష్టి కురిసినా దాన్నంతటినీ ఇముడ్చుకోగల చెరువులూ, వాగులూ, వంకలూ దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ వున్నాయి. వాటిల్లో కొన్ని సహజసిద్ధమైనవీ, కొన్ని మన పూర్వీకులు ఎంతో ముందు చూపుతో నిర్మించినవీ. కానీ చేజేతులా మనమే వాటి పీకనొక్కుతున్నాం. ఇష్టానుసారం ఆక్రమించి అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నా కళ్లుమూసుకుంటున్నాం. హైదరాబాద్‌లోని కంచె గచ్చిబౌలి భూముల్లో బుల్‌డోజర్లు దింపి ప్రకృతి సంపద నాశనం చేస్తున్నారని ఆవేదన చెందిన ప్రధానే, ఆ తర్వాత కొద్దిరోజులకే వేలాది ఎకరాల పంట భూముల్ని మాయం చేసే అమరావతికి రెండోసారి శంకుస్థాపన చేశారు. తమ కూటమి ప్రభుత్వమైతే ఒక లెక్క... వేరే పార్టీ ప్రభుత్వమైతే ఒక లెక్క! నిర్దిష్టమైన విధానాల్లేకుండా 'ఏ రోటి కాడ ఆ పాట'న్నట్టు ప్రవర్తించే పాలకుల వల్లే వైపరీత్యాలు ముంచుకొస్తున్నాయి. వీటిని నివారించటం మానవ మాత్రులకు సాధ్యం కాకపోవచ్చు. కానీ కాస్త తెలివితో వ్యవహరిస్తే వాటివల్ల కలిగే నష్టాలను కనిష్ఠ స్థాయికి తీసుకురావొచ్చు. కారణాలేమైనా వాతావరణం గతంలో మాదిరి లేదు. మన విధ్వంసకర ఆచరణతో దాన్ని మరింత క్షీణింపజేస్తున్నాం. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణగానీ, వికేంద్రీకరణగానీ లేకపోవటంతో నగరాలు కిటకిటలాడుతున్నాయి. నగరాల్లోనే ఉపాధి అవకాశాలుండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అక్కడికే క్యూ కడుతున్నారు. పెరిగిన జనాభాకు తగినట్టు డ్రయినేజీ వ్యవస్థ లేకపోవటంతో చిన్నపాటి వర్షానికే నగరాలు నరకాలుగా మారుతున్నాయి. ఈసారి వర్షరుతువు ఎలా వుండబోతున్నదో ముంబై నగరాన్ని ముంచెత్తిన వాన నిరూపించింది. సహాయ సిబ్బందిని అందుబాటులో వుంచటంతో సహా పలు ముందస్తు చర్యలు తీసుకోవటం మినహా ఈ ఏడాది ఎటూ ఇప్పటికిప్పుడు చేసేదేమీ లేదు. కనీసం రాబోయేకాలంలోనైనా అమల్లోవున్న విధానాలను సమీక్షించుకుని మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ప్రణాళికాబద్ధమైన పథకాలు రూపొందించి అమలుచేసి, వికేంద్రీకరణపై దృష్టిసారిస్తే చాలావరకూ సమస్యలు పరిష్కారమవుతాయి.

సూర్య తెలుగు దిన పత్రిక www.suryaa.com

సంపాదకీయం

## యువతే టార్గెట్‌గా 'సైబర్' రాకెట్

## (విశ్లేషణ)

విదేశీ ఉద్యోగాల పేరున మోసాలు ఎన్నో సాగుతున్నాయి. ఈ ఉచ్చులోపడి వేలాది మంది విదేశాల్లో చిక్కుకుని నానాఅవస్థలు పడుతున్నారు. అక్కడ హింసలను భరించి వెట్టిచాకిరీ చేస్తున్నారు. ఇటువంటి సైబర్ బానిసత్వంలో బాధితులైన వారిని కేంద్ర ప్రభుత్వం రక్షించడానికి అనేక చర్యలు తీసుకుంటోంది. అయినాసరే చాపకింద నీరులా ఈ సైబర్ బానిసత్వ రాకెట్ అంతర్జాతీయ స్థాయిలో థాయిలాండ్, బ్యాంకాక్, మయన్మార్ వంటి దేశాల్లో సాగుతుండడం విశేషం. బ్యాంకాక్‌లో మంచి ఉద్యోగం వస్తుందని, ప్రతినెలా లక్ష రూపాయలు వస్తాయని ఏజెంట్లు ఆశ చూపించడంతో తెలంగాణకు చెందిన కొంతమంది యువకులు దగాపడ్డారు. మయన్మార్ కేంద్రంగా సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లో బందీలుగామారి బలవంతంగా సైబర్ వెట్టి చాకిరీకి గురవుతున్న 2000 మందికి ఇటీవల కేంద్రం చొరవతో విముక్తి లభించడం విశేషం.బాధితుల కథనం ప్రకారం ఏజెంట్లు ముంబై మీదుగా బ్యాంకాక్‌కు విమానంలో తరలించారు. అక్కడ నుంచి పొరుగుదేశాలకు అక్రమ రవాణా చేశారు. అమెరికా, బ్రిటన్ దేశాల్లోని ఎన్‌ఆర్‌ఐలను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసాలు సాగించేలా వీరికి శిక్షణ ఇచ్చారు. సైబర్ క్రైమ్ శిక్షణకోసం భారతీయులను లావోస్‌కు పంపిన దాఖలాలు కూడా బయటపడ్డాయి. అంతర్జాతీయ సైబర్ బానిసత్వ రాకెట్‌లో ఇద్దరు ప్రధాన నిందితులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అరెస్టు చేయగలిగింది. ఈ ఇద్దరు నిందితుల్లో ఒకరు గుజరాత్‌కు చెందిన హితేష్ అర్జన సౌమ్య కాగా, మరొకరు హైదారాబాద్‌కు చెందిన కొలనాటి నాగశివ అలియాస్ జేమ్స్. కొలనాటి నాగశివ అలియాస్ జేమ్స్‌ను మే 19న కొల్‌కతాలోని నేతాజీ సుబాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. లుక్ అవుట్ నోటీస్ ప్రకారం లావోస్ నుండి వచ్చిన తరువాత అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. హితేష్ అర్జన సౌమ్యను ఢిల్లీలో అరెస్టు చేయగలిగారు. హోం మంత్రిత్వశాఖ సమన్వయంతో సైబర్ బానిసత్వానికి గురైన అనేక మంది బాధితులతో అతను ఇటీవల మయన్మార్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చాడు. కంబోడియా, మయన్మార్, లావోస్‌ల్లోని అక్రమ సైబర్ కాల్ సెంటర్ల నుంచి రక్షించబడిన బాధితుల ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణ పోలీసులు అరెస్టు చేయడం గమనార్హం. బాధితుల్లో కొందరిని థాయ్‌లాండ్‌లో ఒక్కొక్కరని 5000 డాలర్లకు అమ్మేయడం కూడా జరిగింది. తెలంగాణకులోని కొహెడ్‌కు చెందిన బాధితుడు తన అనుభవం చెబుతూ బ్యాంకాక్‌కు 200 కి.మీ దూరంలో మంచి జాబ్ ఉందని ఏజెంట్ నమ్మించాడని, తీరా అక్కడకు వెళ్లాక రోజుకు 16 గంటల పని అప్పచెప్పారని, పని చేయడానికి మొండికేయగా, అక్కడున్న చైనీయులు తన పాస్‌పోర్టు గుంజుకున్నారని, చివరకు అక్కడున్న ఆర్మీ వాళ్లకు తాము దొంగతనంగా ఆ దేశానికి వచ్చామని చెప్పి ఆర్మీ వాళ్లకు పట్టించగా జైలు పాలయ్యానని వాపోయాడు. ఇదే విధమైన మోసంతో సుమారు ఐదు వేల మంది భారతీయులు కాంబోడియాకు వెళ్లి నానా అవస్థలు పడుతున్నారు. మోసగాళ్లు వీరిచే బలవంతంగా చట్టవ్యతిరేక సైబర్ నేరాలు చేయిస్తూ స్వదేశంలోని భారతీయుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. కాంబోడియా వేదికగా జరుగుతున్న ఈ స్కామ్‌లో బాధితులను బలవంతంగా దింపుతున్నారు. తాము కేంద్ర ప్రభుత్వ అధికారులుగా నటించి వారిచే సైబర్ నేరాలు చేయిస్తున్నారు. మహిళల పేర్లు, నకిలీ ఫోటోలతో తమతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలు ఓపెన్ చేయించి ఈ వ్యవహారాలు నడిపిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. రోజూ టార్గెట్లు విధించేవారని, అవి నెరవేర్చని వారికి భోజనం కూడా పెట్టేవారు కాదని చెప్పుకొచ్చారు. ఫేస్‌బుక్‌తోపాటు వివిధ డేటింగ్ యాప్‌ల్లో మహిళలవలే తమతో నటింపచేస్తూ భారతీయులను నమ్మిస్తున్నారని, వారి నుంచి క్రిప్టో పెట్టుబడుల పేరిట డబ్బులు దండుకుంటున్నారని తెలిపారు. కాంబోడియాలో ఈ విధంగా దాదాపు 5 వేల మంది భారతీయ నిరుద్యోగులు చిక్కుకున్నారని దర్యాప్తు సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇదే విధంగా మయన్మార్‌లో సైబర్ క్రైమ్ రాకెట్ సాగుతోంది. బాధితులను సోషల్ మీడియా ద్వారా సంప్రదించి థాయిలాండ్, ఇతర తూర్పు ఆసియా దేశాలకు ఉద్యోగాల పేరిట పంపుతున్నారు. పర్యాటక వీసాలపై ఏజెంట్లు మయన్మార్ సరిహద్దుల వరకు తీసుకెళు న్నారు. అక్కడనుంచి పడవల్లో నదులు దాటించి చివరికి సాయుధ తిరుగుబాటు దారుల నియంత్రణలో ఉన్న ప్రాంతాల్లో దింపుతున్నారు. అక్కడనుంచి బాధితులకు తీరని నరకయాతన సాగుతోంది. పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకుని బందీలుగా ఉంచుతున్నారు. చెప్పినపని చేయకుంటూ అవయవాలను తొలగిస్తామని బెదిరిస్తున్నారు. ఈ విధంగా మయన్మార్ సైబర్ క్రైమ ఇరుక్కున్న 60 మంది భారతీయులను మహారాష్ట్ర పోలీస్ సైబర్ విభాగం రక్షించగలిగింది. ఈ కేసుకు సంబంధించి ఒక విదేశీయుడితో సహా ఐదుగురు ఏజెంట్లను అరెస్ట్ చేసింది. ఇదిలా ఉండగా ఉత్తరాది కేంద్రంగా సైబర్ నేరాలు చేసే సూత్రధారులకు సహాయం చేసే పాత్రధారులు హైదరాబాద్ నగరంలో కూడా ఉంటున్నారు. బోగస్ వివరాలతో బ్యాంకు ఖాతాలు తెరిపించి ఇవ్వడం ద్వారా సహకరిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారు. వర్క్ ఫ్రమ్‌హోమ్ అన్న పేరుతో స్కామ్ నడుస్తుండడం ఇటీవలనే బయటపడింది. ఇందులో ప్రధాన పాత్ర వహించిన నలుగురిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగం ద్వారా రోజుకు రూ. 17 వేల నుంచి రూ. 18 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉంటోందని నమ్మిస్తున్నారు. అంతేకాదు తమ వద్ద కొన్ని స్కీమ్‌లు ఉన్నాయని పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మిస్తున్నారు.

# ఇక చీల్చి చెండాడుడే.. భారత వాయుసేన కోసం మరో అస్త్రం సిద్ధం! కీలక ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం

భారత వాయుసేన కోసం మరో అస్త్రం సిద్ధం అవుతోంది. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ-AMCAపై ముందడుగు పడింది. రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదంతో భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ 5వ తరం ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు మార్గం సుగమం అయింది. భారతదేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూషన్ మోడల్‌ను సోమవారం ఆమోదించారు.. దీంతో ఐదోవ తరం AMCA ప్రోటోటైప్ ఫైటర్‌జెట్‌లను తయారు చేయనున్నారు. 5వ తరం ఫైటర్ జెట్‌లను పరిశ్రమల భాగస్వామ్యంతో భారత్ అభివృద్ధి చేయడంతోపాటు ఉత్పత్తి చేయబోతోంది. గ్రౌండ్ స్ట్రయిక్, శత్రువుల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలపైదాడి, ఎలక్ట్రానిక్ వార్ ఫేర్‌లోనూ కీలకంగా మారబోతోంది AMCA. 2035కల్లా AMCA ఉత్పత్తిని ప్రారంభించే అవకాశం ఉంది. రక్షణరంగ ఆత్మనిర్భరతలో మరో అధ్యాయంగా AMCA ఫైటర్‌జెట్ మారబోతోంది.స్వదేశీ 5వ తరం ఫైటర్ జెట్ లను పరిశ్రమ భాగస్వామ్యాల ద్వారా ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నేతృత్వంలో ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ దేశీయ రక్షణ సామర్థ్యాలను పెంచడం.. ఏరోస్పేస్ రంగంలో స్వావలంబన (ఆత్మనిర్భరత) సాధించడం లక్ష్యంగా పెట్టుకుంది. AMCA 5వ తరం ఫైటర్ జెట్‌లను అత్యాధునికంగా తీర్చదిద్దనున్నారు. సెన్సార్ ఫ్యూజన్, అంతర్గత ఆయుధాలు, అధునాతన ఏవియానిక్స్, సూపర్ క్రూయిజ్ సామర్థ్యంతో సహా అత్యాధునిక సాంకేతికతలను కలిగి ఉన్న స్టెల్త్-సెంట్రిక్, మల్టీరోల్ ఫైటర్ జెట్‌గా రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టు 2035 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది.. ఇది భారతదేశ వైమానిక శక్తిని గణనీయంగా పెంచుతుంది. AMCA ప్రాజెక్ట్ భారతదేశ స్వదేశీ రక్షణ సామర్థ్యాలను పెంచడంతోపాటు.. బలమైన దేశీయ అంతరిక్ష పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను పెంపొందిస్తుంది. AMCA అభివృద్ధి దశ కోసం AMCA త్వరలో ఆసక్తి వ్యక్తీకరణ ని జారీ చేయనుంది. ఎగ్జిక్యూషన్ మోడల్ విధానం ప్రైవేట్ %-% ప్రభుత్వ రంగ సంస్థలకు పోటీ ప్రాతిపదికన సమాన అవకాశాలను



అందిస్తుంది. ఆసక్తి ఉన్న సంస్థలు స్వతంత్రంగా, జాయింట్ వెంచర్‌లుగా లేదా కన్సార్టియాలో భాగంగా బిడ్‌లను సమర్పించవచ్చు. పాల్గొనే అన్ని సంస్థలు లేదా బిడ్డర్లు భారతీయ కంపెనీలు అయి ఉండాలి.. దేశ చట్టాలు, నిబంధనలకు కట్టుబడి ఉండాలి. ఈ చొరవ AMCA నమూనా అభివృద్ధికి స్వదేశీ నైపుణ్యం, సామర్థ్యాలు, వనరులను ముందుకు తీసుకురావడంలో ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. ఈ కార్యక్రమం ఏరోస్పేస్ రంగంలో స్వావలంబన (ఆత్మనిర్భరత)ను ముందుకు తీసుకెళ్లడంలో కీలకమైన మైలురాయిని సూచిస్తుంది.. అంతేకాకుండా దేశ రక్షణ, విమానయాన తయారీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో భారతదేశం నిబద్ధతను నొక్కి చెబుతుంది. 2035 నాటికి AMCA ను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అందజేయనుంది. దీనిని ప్రవేశపెట్టిన తర్వాత, ఈ విమానం భారతదేశ వైమానిక ఆధిపత్యాన్ని గణనీయంగా పెంచుతుంది.. ముఖ్యంగా అధిక ముప్పు.. పోటీ ఉన్న గగనతలాలలో వీటిని మోహరించనున్నారు.

# మరోసారి అమెరికాలో విజృంభిస్తున్న కరోనా మహమ్మారి.. 7 రోజుల్లో 350 మరణాలు!

కరోనా రీఎంట్రీ కలకలం రేపుతోంది. అది కొత్త రూపంలో పంజా విసురుతోంది. ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఇటు భారత్ పాటు అమెరికాలో కోవిడ్ -19 కేసులు పెరుగుతున్నాయి. అమెరికాలో కరోనా ధాటికి గత వారం రోజుల్లో వందలాది మందిని ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం పరిస్థితి మునుపటిలా దారుణంగా లేనప్పటికీ, కరోనా పూర్తిగా పోలేదని ఖచ్చితంగా స్పష్టమైంది. గత కొన్ని వారాలుగా మన దేశంలోని వివిధ ప్రాంతాల నుండి కరోనా కేసులు నమోదవుతున్నాయి. కొవిడ్-19 మళ్లీ డేంజర్‌బెల్స్ మోగిస్తోంది. దేశవ్యాప్తంగా వందలాది కరోనా కేసులు నమోదవుతున్నాయి. కేరళలో 430కి పెరిగిన యాక్టివ్ కేసులు. మహారాష్ట్రలో 209, ఢిల్లీలో 104, గుజరాత్‌లో 83.. తమిళనాడులో 69, కర్నాటకలో 47, ఉత్తరప్రదేశ్‌లో 15, పశ్చిమ బెంగాల్‌లో 11 యాక్టివ్ కేసులు ఉన్నట్లు కేంద్ర వైద్యారోగ్య శాఖ తెలిపింది. ఇటు తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కరోనా కేసులు నమోదు అవుతుండగా.. నోయిడాలో 9 కరోనా కేసులు రికార్డ్ అయ్యాయి. గణాంకాలే కాదు, కరోనా మరణాలు కూడా మరోసారి భయాన్ని పెంచాయి. ఇప్పటివరకు 7 మంది మహమ్మారి బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. అయితే వారి మరణానికి కారణం కరోనా లేదా మరేదైనా వ్యాధి కాదా అనేది స్పష్టంగా లేదు. దేశంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో అన్ని రాష్ట్రాలను కేంద్రం అలర్ట్ చేసింది. ముందు జాగ్రత్తగా ఆస్పత్రులు సిద్ధం చేయాలని ఆదేశించింది. అయితే.. ఆయా రాష్ట్రాల్లోని కరోనా బాధితులకు స్వల్ప లక్షణాలు మాత్రమే ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. బాధితుల్లో ఎక్కువమంది ఇంట్లోనే చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపింది. భయపడాల్సిన అవసరం లేదని సూచించింది. అదేవిధంగా, థాయిలాండ్‌లో పరిస్థితి మరింత దిగజారుతున్నట్లు కనిపిస్తోంది, ఇక్కడ కేవలం ఒక వారంలోనే 50 వేలకు పైగా కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. మరోవైపు, అమెరికాలో కరోనా ఇప్పటికీ ప్రాణాలను బలిగొంటోంది. గత వారం 350 మంది అమెరికన్లు కోవిడ్-19 కారణంగా మరణించారని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపింది. ఈ సంఖ్య మునుపటి కంటే తక్కువగా ఉంది. కానీ ఆందోళన కొనసాగుతోంది. %బీదీ%.1.8.1 అనే కొత్త సబ్-వేరియంట్ అమెరికా, సింగపూర్, హాంకాంగ్‌లతో సహా ఆసియాలో విస్తరిస్తోంది. శాస్త్రవేత్తల ప్రకారం, ఈ



వైవిధ్యమైన వైరస్ వేగంగా వ్యాపిస్తుంది. అయినప్పటికీ దాని తీవ్రత గురించి పరిశోధనలు ఇంకా కొనసాగుతున్నాయి. అమెరికాలో కేవలం 23% పెద్దలు మాత్రమే బుస్టర్ డోస్ వ్యాక్సిన్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పిల్లలలో ఈ సంఖ్య ఇంకా తక్కువగా ఉంది. కేవలం 13% మాత్రమే. టీకాలు వేయకపోవడం, కాలక్రమేణా రోగనిరోధక శక్తి బలహీనపడటం రెండూ ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయని నిపుణులు అంటున్నారు. వృద్ధులు, ఇప్పటికే అనారోగ్యంతో ఉన్నవారిపై ఈ వైరస్ ఎక్కువ ప్రభావం చూపుతోంది. అందువల్ల, 65 ఏళ్లు పైబడిన వారు ప్రతి ఆరు నెలలకు రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. మరో ప్రధాన కారణం ఏమిటంటే, పరిస్థితి మరింత దిగజారే వరకు ప్రజలు చికిత్స తీసుకోకపోవడమే అంటున్నారు నిపుణులు. మోల్నుపిరవిర్ (మెర్క్), పాక్లోవిడ్ (ఫైజర్) వంటి యాంటీవైరల్ మాత్రలు %ఖూ%లో అందుబాటులో ఉన్నాయి, వీటిని లక్షణాలు ప్రారంభమైన ఐదు రోజుల్లోపు తీసుకోవచ్చు. కానీ చాలా మంది వాటిని సరైన సమయంలో ఉపయోగించరు. సకాలంలో పరీక్షలు, మందులతో తీవ్రమైన ఇన్ఫెక్షన్లను నివారించవచ్చని వైద్యులు అంటున్నారు.

# రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ మరికొంత ఆలస్యం.. ఖర్గే లేకపోవడంతో ఈ నెల 30కి వాయిదా పడ్డ కీలక సమావేశం

రాష్ట్ర క్యాబినేట్ విస్తరణ ముహూర్తం మరోసారి వాయిదా పడింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో ఈ నెల 30 కి మీటింగ్ ను వాయిదా వేశారు. ప్రస్తుతం ప్రకృతి చికిత్స లో ఉన్న ఖర్గే షెడ్యూల్ ప్రకారం సోమవారం ఢిల్లీకి చేరుకోవాల్సి ఉంది. అయితే.. వైద్యుల సూచలన మేరకు ఆయన చికిత్స్ మరో రెండు రోజులు కొనసాగనున్నట్లు ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 30 వ తేదిన ఖర్గే ఢిల్లీ చేరుకోనున్నారు. దీంతో రెండు రోజులు ఎదురు చూపుల తర్వాత సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ కు వెనుదిరిగారు. సోమవారం అక్బర్ రోడ్ లోని జన్ పథ్ 10 లో రాహుల్ గాంధీతో పార్టీ వ్యవహారాల జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లు వేరు వేరుగా భేటి అయ్యారు. సాయంత్రం 5:15 కు ప్రారంభమైన ఈ సమావేశం గంట పాటు సాగింది. తొలుత కేసీ వేణుగోపాల్ కేరళలోని నీలంబూర్ అసెంబ్లీ బై ఎలక్షన్ కు సంబంధించి పార్టీ అభ్యర్థి ప్రకటనపై చర్చించారు. ఇక్కడి నుంచి ఆర్యదన్ షౌకత్ ను బరిలోని నిలిపాలని నిర్ణయించారు. అనంతరం తెలంగాణ మంత్రి వర్గ కూర్పుతో పాటు, పీసీసీ నూతన కార్యవర్గం అంశాలను రాహుల్ కు బ్రీఫ్ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఐదు బెర్త్ లకు సంబంధించి ఏడుగురి పేర్లను ప్రియార్టీలో ఉన్నట్లు తెలిపారు. అలాగే నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, తక్కువ సంఖ్యతో కూడిన పీసీసీ కార్యవర్గ లిస్ట్ ను సమర్పించారు. వీటిపై కేసీ వేణుగోపాల్ బ్రీఫ్ చేయగా.. అనంతరం పీసీసీ చీఫ్ కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీని కలిసారు. కుటుంబ వారితో కాసేపు ముచ్చటించిన రాహుల్, తర్వాత మహేశ్ కుమార్ గౌడ్ తో ప్రత్యేకంగా భేటి అయ్యారు. క్యాబినేట్ కూర్పు, పీసీసీ కార్యవర్గం, కవిత లేఖ, రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై ఆరా తీసారు. ఈ సందర్భంగా సాధ్యమైనంత త్వరగా క్యాబినేట్ విస్తరణ చేపట్టాలని, అందులో బీసీలకు రెండు పదవులు ఇవ్వాలని మహేశ్ కుమార్ గౌడ్ రాహుల్ ని కోరినట్లు తెలిసింది. ప్రస్తుతం బీసీ కుల గణన తో దేశ వ్యాప్తంగా వెళ్తోన్న నేపథ్యంలో.. ఈ నిర్ణయం పార్టీకి మరింత కలిసి వస్తుందని వ్యక్తిగత అభిప్రాయాన్ని తెలిపినట్లు సమాచారం. అలాగే కార్యవర్గంలోనూ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఇతర పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

క్యాబినేట్ విస్తరణ త్వరగా చేయాలని రాహుల్ గాంధీనీ కోరా: పీసీసీ

వీలైనంత త్వరగా క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేయాలని రాహుల్ గాంధీని కోరినట్లు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. తమ రిక్వెస్ట్ పై రాహుల్ సానుకూలంగా స్పందించారని త్వరగా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మర్యాద పూర్వకంగా కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీని కలిసినట్లు మహేశ్ కుమార్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అంశాలను రాహుల్



గాంధీకి వివరించినట్లు తెలిపారు. 'మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ఇప్పటికే రెండుసార్లు మా అభిప్రాయాలను అధిష్టానానికి తెలిపామన్న పిసిసి.. తెలంగాణ క్యాబినెట్‌లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని అధిష్టానాన్ని కోరామన్నారు. త్వరగా క్యాబినేట్ కూర్పు చేయాలని రాహుల్ ని విజ్ఞప్తి చేశామని త్వరలో ఉంటుందని ఆశిస్తున్నామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో పీసీసీ కార్యవర్గం ప్రకటన ఉంటుందని వెల్లడించారు. అయితే కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణ పై సీఎంతో కలిసి సమావేశం ఉంటుందా అనే అంశంపై తనకు క్లారిటీ లేదని చెప్పారు.

సీఎంతో పీసీసీ భేటి..

రాహుల్ తో భేటి అనంతరం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేరుగా తుగ్లక్ రోడ్ 23 లోని సీఎం అధికారిక నివాసానికి చేరుకున్నారు. దాదాపు అరగంట పాటు సీఎంతో చర్చించారు. రాహుల్ తో భేటి సందర్భంగా జరిగిన అంశాలను బ్రీఫ్ చేశారు. ప్రస్తుతం ఖర్గే అందుబాటులో లేనందున ఈ నెల 30 కి మీటింగ్ ను వాయిదా వేసిన విషయాన్ని వివరించారు. అయితే.. ఇప్పటికే రెండు రోజులు వేచి చూసిన నేపథ్యంలో మరో రెండు రోజులు పాటు ఢిల్లీలో ఉండేందుకు సీఎం విముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాత్రి 8 గంటలకు ఢిల్లీ పర్యటన ముగించుకొని సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ తిరిగి బయలుదేరారు. కాగా.. రెండు రోజులు పర్యటనలో రాహుల్ తో సీఎం భేటి కాకపోవడంపై కొత్త చర్చ మొదలైంది. పీసీసీ చీఫ్ కు అపాయిట్మెంట్ ఇచ్చిన రాహుల్.. సీఎంకు ఎందుకు ఇవ్వలేదన్న ప్రచారం సాగుతోంది. సీఎం రేవంత్ అపాయిట్మెంట్ కోరలేదా..? లేక కోరిన రాహుల్ ఇవ్వలేదా? అన్న ప్రశ్న నెలకొంది.






## ఐపీఎల్ 2025 తర్వాత రిటైర్ కానున్న క్రికెటర్లు వీరే..?



ఐపీఎల్ 2025 సీజన్ ముగింపు దశకు చేరుకుంది. ప్లే ఆఫ్స్ బెర్త్‌లు (పంజాబ్, గుజరాత్, ఆర్సీబీ, ముంబై) ఇదివరకే ఖరారయ్యాయి. క్వాలిఫయర్-1 (పంజాబ్), ఎలిమినేటర్ (ముంబై) మ్యాచ్‌ల్లో కూడా ఒక్కో బెర్త్ ఖరారైంది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన జట్లు (సీఎస్కే, రాజస్థాన్, ఎస్ఆర్‌హెచ్, కేకేఆర్, లక్నో, ఢిల్లీ) తదుపరి సీజన్‌లో మరింత బలంగా తిరిగి రావాలని ఆశిస్తున్నాయి. కొన్ని జట్లు తదుపరి సీజన్‌లో ఎవరిని వదిలించుకోవాలో, ఎవరిని అట్టిపెట్టుకోవాలో అన్నదానిపై ఇ?ప్పటికే ఓ అంచనా కలిగి ఉన్నాయి. ఆటగాళ్ల రిటెన్షన్ గురించి మాట్లాడుకుంటే వెటరన్ ఆటగాళ్ల ప్రస్తావన వస్తుంది. కొందరు వెటరన్లు లీగ్ ప్రారంభం నుంచి ఆడుతూ ఇంకా కొనసాగుతున్నారు. వీరిలో కొందరకి ఈ సీజన్ ఆఖరిదయ్యే అవకాశం ఉంది. ఇలాంటి వారిపై ఓ లుక్కేద్దాం. ఈ సీజన్ తర్వాత రిటైరయ్యే ఆటగాళ్ల ప్రస్తావన వస్తే అందరికీ ముందుగా గుర్తొచ్చే పేరు ధోని. 44 ఏళ్ల ధోని అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి చాలా కాలమైనా ఐపీఎల్‌లో కొనసాగుతున్నాడు. ధోనికి ఈ సీజన్ ఆఖరిదని చాలామంది అంటున్నారు. ధోని ఈ విషయంపై ఎలాంటి క్లారిటీ ఇవ్వనప్పటికీ.. రిటైర్ కానని కూడా ఖరాఖండిగా చెప్పలేదు. ధోని ఈ సీజన్‌లో ఆటగాడిగా, కెప్టెన్‌గా దారుణంగా విఫలమయ్యాడు. అతడిపై వయోభారం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ఐపీఎల్ సీజన్ తర్వాత రిటైరయ్యే అవకాశమున్న మరో ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్. 39 ఏళ్ల అశ్విన్‌ను ఈ సీజన్ మెగా వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ భారీ మొత్తం వెచ్చించి సొంతం చేసుకుంది. అయితే యాష్ అంచనాలకు తగ్గట్టుగా రాణించలేదు. కుర్ర విధ్వంసకర బ్యాటర్ల ముందు అతని మాయాజాలం పని చేయలేదు. జట్టు నుంచి స్వతహాగా వైదొలగాలని సొంత జట్టు అభిమానులే కోరుకున్నారు. ఈ నేపథ్యంలో అశ్విన్ ఈ సీజన్ తర్వాత ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పడం? గ్యారెంటీ అని తెలుస్తుంది. ఈ సీజన్ తర్వాత రిటైరయ్యే అవకాశమున్న మరో స్టార్ క్రికెటర్ ఫాఫ్ డుప్లెసిస్. ఫాఫ్‌ను ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఓ మోస్తరు ధరకే సొంతం చేసుకుంది. వయసు మీద పడటంతో ఫాఫ్ మునుపటిలా వేగంగా ఆడలేకపోతున్నాడు. అందుకే అతన్ని ఆర్సీబీ వదిలించుకుంది. 40 ఏళ్ల ఫాఫ్ కుర్ర బ్యాటర్లతో పోటీపడి గతంలోలా భారీ షాట్లు ఆడలేక పోతున్నాడు. వాస్తవానికి ఆర్సీబీ వదిలించుకున్నప్పుడే అతని పనైపోయిందని అంతా అనుకున్నారు. అయితే ఢిల్లీ ఏదో ప్రణాళికతో అతన్ని దక్కించుకుంది. తీరా అది కూడా ఫ్లాప్ అయ్యింది. ఈ సీజన్ తర్వాత రిటైరయ్యే అవకాశమున్న మరో స్టార్ క్రికెటర్ మొయిన్ అలీ. త్వరలో 38లో అడుగుపెట్టనున్న మొయిన్ ఈ సీజన్ తర్వాత ఐపీఎల్‌కు గుడ్‌బై చెబుతాడని టాక్ నడుస్తుంది. ఈ సీజన్‌లో మొయిన్‌ను కేకేఆర్ నామమాత్రపు ధరకు సొంతం చేసుకుంది. మొయిన్ ఫ్రాంచైజీ నమ్మకానికి వంద శాతం న్యాయం చేయలేక పోయినా, పర్వాలేదనిపించాడు. మొయిన్ విదేశీ లీగ్‌లపై దృష్టి పెట్టేందుకు తనకు పెద్దగా డిమాండ్ లేని ఐపీఎల్‌ను వదిలేసుకోవాలని అనుకుంటున్నట్లు తెలుస్తుంది. పైన పేర్కొన్న ఆటగాళ్లే కాకుండా విజయ్ శంకర్ (సీఎస్కే), మోహిత్ శర్మ (ఢిల్లీ), అజింక్య రహానే (కేకేఆర్) కూడా ఈ సీజన్ తర్వాత ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పవచ్చని టాక్ నడుస్తుంది.

## యు ముంబా హెడ్ కోచ్‌గా అనిల్




ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో యు ముంబా జట్టుకు అనిల్ చప్రానా హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. పీకేఎల్ 11వ సీజన్‌లో యు ముంబా జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న గులామ్‌రజా మజందరాని (ఇరాన్) సీజన్ ముగిశాక తన బాధ్యతల నుంచి వైదొలిగాడు. గత సీజన్‌లో అనిల్ చప్రానా యు ముంబా జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా పని చేశాడు. గులాంరజా తప్పుకున్న తర్వాత 12వ సీజన్ కోసం భారత మాజీ ప్లేయర్ రాకేశ్ కుమార్‌ను యు ముంబా కొత్త హెడ్ కోచ్‌గా నియమించుకుంది. అయితే ఆదివారం అనూహ్య పరిణామంచోటు చేసుకుంది. రాకేశ్‌ను హెడ్ కోచ్ పదవి నుంచి తప్పిస్తున్నామని ముంబా సీఈఓ సుహైల్ చందోక్ తెలిపారు. రాకేశ్‌తో సంప్రదింపులు చేశాకే ఈ నిర్ణయం తీసుకున్నామని చందోక్ వివరించారు. 2022లో యు ముంబా జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న అనిల్ చప్రానాకు మరోసారి ఆ బాధ్యతలు అప్పగిస్తున్నామని, అసిస్టెంట్ కోచ్‌గా పార్థిబన్‌ను ఎంపిక చేశామని సోమవారం సదరు ఫ్రాంచైజీ పేర్కొంది. ఈనెల 31న, జూన్ 1న పీకేఎల్ 12వ సీజన్ కోసం ఆటగాళ్ల వేలం కార్యక్రమం జరగనుంది. 2014లో పీకేఎల్ ఆరంభ సీజన్ నుంచి పోటీపడుతున్న యు ముంబా జట్టు రెండుసార్లు రన్నరప్‌గా, ఒకసారి చాంపియన్‌గా (2015) నిలిచింది. గత సీజన్‌లో యు ముంబా టాప్%-%6లో నిలిచి ఎలిమినేటర్ మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ చేతిలో ఓడింది.

## గిల్‌ను కాదు అతడిని కెప్టెన్‌గా సెలక్ట్ చేయాల్సింది: వీరేంద్ర సెహ్వాగ్




ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమిండియా టెస్టు జట్టు కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్ ఎంపికైన సంగతి తెలిసిందే. అదేవిధంగా గిల్‌కు డిప్యూటీగా వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ నియమితుడయ్యాడు. రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. పలు మీడియా రిపోర్ట్‌లు ప్రకారం.. కెప్టెన్సీ రేసులో నుంచి ఫిట్‌నెస్, వర్క్‌లోడ్ కారణంగా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా తప్పుకోవడంతో గిల్‌కు జట్టు పగ్గాలను సెలక్టర్లు అప్పగించారు. కాగా భారత సెలక్టర్ల ముందు గిల్‌తో పాటు కేఎల్ రాహుల్, రిషబ్ ?పంత్ అప్షన్స్ కూడా ఉండేవి. కానీ జట్టు దీర్ఘకాలక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించినట్లు బీసీసీఐ ఛీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ టీమ్ సెలక్షన్ ప్రెస్‌మీట్‌లో తెలిపాడు. అయితే 25 ఏళ్ల గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయడంపై భిన్నభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఇదే విషయంపై భారత మాజీ క్రికెటర్‌లు మనోజ్ తివారీ,వీరేంద్ర సెహ్వాగ్‌లు తమ మనసులోని మాటను బయటపెట్టారు. ఫిట్‌నెస్ సమస్యల కారణంగానే బుమ్రా కాదని గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించరాని తివారీ అన్నాడు. "భారత టెస్టు కెప్టెన్సీకి శుబ్‌మన్ గిల్ సెకెండ్ బెస్ట్ ఆప్షన్. సెలక్టర్లకు తొలి ఎంపికగా బుమ్రా ఉండేవాడు. కానీ ఫిట్‌నెస్ సమస్యల వల్ల తుదిజట్టులో ఆడలేని వారికి సారథ్య బాధ్యతలు ఎలా అప్పగిస్తారు. అందుకే తమ సెకెండ్ అప్షన్ అయిన గిల్‌కు జట్టు పగ్గాలను కట్టబెట్టారు" అని క్రిక్‌బజ్ లైవ్ షోలో తివారీ పేర్కొన్నాడు. అయితే తివారీ వ్యాఖ్యలతో సెహ్వాగ్ విభేదించాడు. గిల్‌ను కాకుండా పంత్ కెప్టెన్‌గా ఎంపిక చేసి ఉంటే బాగుండేదని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. "కేవలం ఒక్క సిరీస్ కోసం అయితే బుమ్రాను కెప్టెన్‌గా సెలక్ట్ చేయవచ్చు. అందులో ఎటువంటి సమస్య లేదు. కానీ దీర్ఘకాలనికి అయితే ఈ నిర్ణయం సరైంది కాదు. భారత్ ఒక ఏడాది 10 టెస్టులు ఆడితే, ఆ మ్యాచ్‌లన్నీ బుమ్రా ఆడగలడా అని అడగాలి? లేదా అతడు ఎన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండగలడు అని ప్రశ్నించాలి. కెప్టెన్‌ను ఎంపిక చేయడంలో అది ఒక ప్రధాన అంశం. కానీ సెలక్టర్లు ఆ ఒత్తిడిని, వర్క్‌లోడ్‌ను బుమ్రాపై పెట్టాలనుకోలేదు. అందుకే అతడిని కెప్టెన్‌గా ఎంపిక చేయలేదు. సెలక్టర్లు తీసుకుంది సరైన నిర్ణయం అని నేను కూడా భావిస్తున్నాను. అయితే కెప్టెన్సీకి గిల్ రెండవ బెస్ట్ ఆప్షన్ అని తివారీ అన్నారు. నా దృష్టిలో టీమిండియాకు సారథిగా రిషభ్ పంత్ సెకండ్ బెస్ట్ ఆప్షన్. టెస్ట్ క్రికెట్‌కు పంత్ చేసినంతగా, ఇతర మరే ఇతర ఆటగాడు చేయలేదు. విరాట్ కోహ్లి తర్వాత టెస్టు క్రికెట్ చూసేలా చేసిన ప్లేయర్ పంత్. కారు ప్రమాదం నుంచి కోలుకుని వచ్చిన తర్వాత పంత్ అంతగా ప్రభావం చూపలేకపోయాడు. దీన్ని నేను కూడా అంగీకరిస్తున్నాను. అతడు తిరిగి తన ఫామ్‌ను అందుకంటే, భవిష్యత్తులో అతన్ని కెప్టెన్‌గా చేసే నిర్ణయాన్ని సెలక్టర్లు తీసుకొవచ్చు. అందుకే వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అయితే భారత టెస్టు సారథిగా చాలా కొద్ది మంది బౌలర్లరే వ్యవహరించారు.నేను క్రికెట్ ఆడిన కాలంలో కే వలం అనిల్‌కుంబ్లేనే ఈ ఫీట్ సాధి ంచాడు. అదేవిధంగా అన్ని మ్యాచ్ లకు కూడా అతడు అందుబాటులో ఉన్నా డని" సెహ్వాగ్ విశ్లేషించాడు.

## చరిత్ర సృష్టించిన శ్రేయస్ అయ్యర్..



ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టింది. జైపూర్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో పంజాబ్ ఘన విజయం సాధించింది. దీంతో పంజాబ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోంది.ఇక ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. సూర్యకుమార్ (39 బంతుల్లో 57బీ 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 26బీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అర్ష్‌దీప్, యాన్సెన్, వైశాక్ తలా 2 వికెట్లు పడగొట్టారు.అనంతరం పంజాబ్ కింగ్స్ 18.3 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి 187 పరుగులు చేసి గెలిచింది. జోష్ ఇన్‌గ్లిస్ (42 బంతుల్లో 73బీ 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 62బీ 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ముంబై బౌలర్లలో సాంట్నర్ రెండు వికెట్లు పడగొట్టగా.. బుమ్రా ఒక్క వికెట్ సాధించారు. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.

చరిత్ర సృష్టించిన శ్రేయస్..

ఐపీఎల్ చరిత్రలో మూడు వెర్వేరు జట్లును క్వాలిఫయర్స్‌కు తీసుకెళ్లిన ఏకైక కెప్టెన్‌గా అయ్యర్ రికార్డులకెక్కాడు. 2018లో ఢిల్లీ క్యాపిటల్స్ తో తన ఐపీఎల్ కెరీర్‌ను ప్రారంభించిన శ్రేయస్.. 2020 సీజన్‌లో ఢిల్లీ జట్టును కెప్టెన్‌గా రెండవ స్థానానికి చేర్చాడు.సెకెండ్ క్వాలిఫయర్‌లో గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్..

దురదృష్టవశాత్తూ ఆఖరి మెట్టుపై బోల్తా పడింది. అనంతరం ఐపీఎల్-2024 పాయింట్ల పట్టికలో శ్రేయస్ సారథ్యంలోని కోల్‌కతా నైట్ రైడర్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఫైనల్లో ఎస్ఆర్‌హెచ్‌ను చిత్తు చేసి మూడో ఐపీఎల్ టైటిల్‌ను కేకేఆర్ సొంతం చేసుకుంది. ఇప్పుడు పంజాబ్‌ను క్వాలిఫయర్స్‌కు చేర్చి ఈ ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు.

## వెస్టిండీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన ఇంగ్లండ్

మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇంగ్లండ్ మహిళా క్రికెట్ జట్టు వెస్టిండీస్‌ను 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. ఈ సిరీస్‌లో భాగంగా నిన్న (మే 26) జరిగిన మూడో టీ20లో ఇంగ్లండ్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేయగా.. విండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 127 పరుగులు మాత్రమే చేయగలిగింది.

**రాణించిన హీథర్ నైట్**

స్టార్ మిడిలార్డర్ బ్యాటర్ హీథర్ నైట్ అజేయ అర్ధ సెంచరీతో (66) రాణించడంతో ఇంగ్లండ్ ఓ మోస్తరు స్కోర్ చేయగలిగింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో నాట్ సీవర్ బ్రంట్ 37, ఆమీ జోన్స్ 22,అలైస్ క్యాప్సీ 4, సోఫియా డంక్లీ 3, ఎమ్ ఆర్లాట్ 2 (నాటౌట్) పరుగులు చేశారు. విండీస్ బౌలర్లలో హేలీ మాథ్యూస్ 3, జైదా జేమ్స్, క్లాక్సన్ తలో వికెట్ పడగొట్టారు.

**హేలీ పోరాటం వృథా**

145 పరుగుల ఓ మోస్తరు లక్ష్య ఛేదనలో విండీస్ తడబడింది. ఆ జట్టు కెప్టెన్ హేలీ మాథ్యూస్ (71) ఒంటరిపోరాటం? చేసినా గెలవలేకపోయింది. విండీస్ ఇన్నింగ్స్‌లో మాథ్యూస్‌తో పాటు గ్రిమ్మండ్ (15), గజ్నబి (14) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లు లారెన్ బెల్, ఆర్లాట్, చార్లోట్ డీన్, లిన్సే స్మిత్ తలో రెండు వికెట్లు పడగొట్టి విండీస్‌ను కట్టడి చేశారు.

**30 నుంచి ప్రారంభం?**

కాగా, మూడు టీ20లు, మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం విండీస్ జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తుంది. టీ20 సిరీస్ నిన్నటితో ముగియగా.. మే 30 (డెర్బీ), జూన్ 4 (లీసెస్టర్), 7 తేదీల్లో (టాంటన్) మూడు వన్డేలు జరుగనున్నాయి.




## సూర్యకుమార్ వరల్డ్ రికార్డు.. సౌతాఫ్రికా కెప్టెన్‌ను దాటేశాడు




ఐపీఎల్-2025లో టీమిండియా టీ20 కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ దుమ్మురేపుతున్నాడు. సోమవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ అద్భుతమైన హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో 39 బంతులు ఎదుర్కొన్న సూర్యకుమార్.. 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 57 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ క్రమంలో సూర్య భాయ్ ఓ వరల్డ్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 క్రికెట్‌లో వరుసగా అత్యధిక సార్లు 25 పరుగులు దాటిన క్రికెటర్‌గా సూర్య చరిత్రపుటలెక్కాడు. ఐపీఎల్-2025 సీజన్‌లో ఈ ముంబైకర్ వరుసగా 14 సార్లు 25 పైగా పరుగులు చేశాడు. దీంతో ఈ ఫీట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇంతకుముందు ఈ రికార్డు దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా పేరిట ఉండేది. బావుమా వరుసగా 13 టీ20 మ్యాచ్‌లలో 25 ప్లస్ పరుగులు చేశాడు. తాజా మ్యాచ్‌తో ప్రోటీస్ కెప్టెన్‌ను సూర్య అధిగమించాడు. ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటివరకు 14 మ్యాచ్‌లు ఆడిన సూర్యకుమార్ 640 పరుగులు చేశాడు. ఆరెంజ్ క్యాప్ రేసులో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ముంబై ఇండియన్స్‌పై 7 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్ ఘన విజయం సాధించింది. ఈ విజయంతో పంజాబ్ టాప్ స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. సూర్యకుమార్ (39 బంతుల్లో 57బీ 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 26బీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అర్ష్‌దీప్, యాన్సెన్, వైశాక్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం పంజాబ్ కింగ్స్ 18.3 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి 187 పరుగులు చేసి గెలుపొందింది.

# సినిమా చిత్రం

## మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ ఓటీటీ డేట్ ఫిక్స్



ఈ మధ్య కాలంలో డబ్బింగ్ సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. థియేటర్లలోనే కాకుండా ఓటీటీలో ఇతర భాషల సినిమాలను డబ్బింగ్ వర్షన్ చూసి మురిసి పోతున్న ప్రేక్షకులు చాలా మంది ఉన్నారు. తెలుగు ప్రేక్షకుల్లో ఎక్కువ శాతం మలయాళ సినిమాలను ఇష్టపడుతున్నారు. హిందీ ప్రేక్షకులు ఎక్కువ శాతం మంది తెలుగు డబ్బింగ్ సినిమాలను ఇష్టపడుతున్నారు. మలయాళం సినిమాలను దేశ వ్యాప్తంగా అన్ని భాషల ప్రేక్షకులు అభిమానిస్తూ ఉంటారు. ముఖ్యంగా మలయాళ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అయిన సినిమాలకు అక్కడ ఇక్కడ అని కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇండియన్ సినీ ప్రేమికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తాజా చిత్రం 'తుడారుమ్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. వరల్డ్ బాక్సాఫీస్ వద్ద దాదాపుగా రూ.250 కోట్ల వసూళ్లు రాబట్టడం ద్వారా రికార్డ్ బ్రేక్ చేసిన ఈ సినిమాను ప్రముఖ ఓటీటీ జియో హాట్‌స్టార్ స్ట్రీమింగ్‌కి సిద్దం అయింది. ముందుగా అనుకున్న ప్రకారం ఇప్పటికే సినిమా స్ట్రీమింగ్ మొదలు కావాల్సి ఉంది. ఏప్రిల్ మూడో వారంలో విడుదలైన ఈ సినిమాను మే మూడో వారంలో ఓటీటీ స్ట్రీమింగ్ చేయాలని భావించారు. కానీ ఇప్పటికీ థియేటర్‌లో స్ట్రీమింగ్ అవుతున్న కారణంగా ఓటీటీ స్ట్రీమింగ్ వాయిదా వేశారు. వారం ఆలస్యంగా సినిమాను జియో హాట్‌స్టార్ వారు స్ట్రీమింగ్‌కు రెడీ చేశారు.

తుడారుమ్ సినిమాను మే 30 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు జియో హాట్‌స్టార్ అధికారికంగా ప్రకటించింది. మలయాళంతో పాటు ఇతర భాషల్లోనూ డబ్ అయ్యి థియేట్రికల్ రిలీజ్ అయిన ఈ సినిమాను ఎక్కువ శాతం మంది థియేటర్‌లో చూడలేక పోయారు. అందుకే ఓటీటీ స్ట్రీమింగ్ కోసం ఎక్కువ శాతం మంది అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

పాన్ ఇండియా రేంజ్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా ఈ సినిమాను ఓటీటీ ద్వారా కచ్చితంగా అత్యధికులు చూసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మలయాళ సినిమా అదీ సూపర్ స్టార్ సినిమా కావడంతో ఓటీటీలో తుడారుమ్ కి కచ్చితంగా మంచి డిమాండ్ ఉండే అవకాశాలు ఉన్నాయి. మోహన్‌లాల్‌తో పాటు ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ శోభన dverనటించారు.

తరుణ్ మూర్తి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను ఎం రంజిత్ నిర్మించారు. భారీ మొత్తానికి ఈ సినిమాను కొనుగోలు చేసిన జియో హాట్‌స్టార్ వారు కచ్చితంగా పెట్టిన పెట్టుబడికి రెట్టింపు లాభం దక్కించుకునే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. టాక్సీ డ్రైవర్‌గా ప్రశాంతమైన జీవితం సాగించే షణ్ముగం అలియాస్ బెంజ్ తన కారు కోసం చేసే పోరాటం గురించి ఈ సినిమా కథ.

ఫ్యామిలీకి అత్యంత ప్రాముఖ్యత ఇచ్చే వ్యక్తి జీవితంలో ఎదురయ్యే సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు. సినిమాలో మోహన్ లాల్, శోభనల నటన విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. అందుకే ఓటీటీలో సినిమా స్ట్రీమింగ్ మొదలు అయితే కచ్చితంగా ఓ రేంజ్‌లో సోషల్ మీడియాలో సందడి చేయడం ఖాయం.

## కన్నప్ప సీన్స్ ఉన్న హార్డ్ డిస్క్ మిస్ అయింది? ఏం జరిగింది?



టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప మరికొద్ది రోజుల్లో రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఆ మూవీ జూన్ 27వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నార్త్ టు సౌత్ అనేక మంది స్టార్ నటీనటులు భాగమైన ఆ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి.అదే సమయంలో కన్నప్ప మూవీకి సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఉన్న హార్డ్ డ్రైవ్ పట్టుకుని ఇద్దరు పరారయ్యారన్న వార్తలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. కంటెంట్ ఉన్న హార్డ్ డిస్క్ ను ముంబైకు చెందిన వీఎఫ్ ఎక్స్ కంపెనీ.. హైదరాబాద్ కు కొరియర్ లో పంపింది. ఆ హార్డ్ డిస్క్ ను ఆఫీస్ బాయ్ రఘు తో పాటు మరో మహిళ దాచేశారు అని అంటున్నారు.దీంతో వారిద్దరూ తప్పించుకుని తిరుగుతుండగా.. ఫిల్మ్ నగర్ పోలీసులకు కన్నప్ప ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఎవరి మార్గదర్శకత్వంలో సినిమా నష్టం కలిగించాలనే దురుద్దేశంతో రఘు, చరితలు కలిసి ఇలా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. రంగంలోకి దిగారు.సినిమాలో కీలక కంటెంట్ ఉందని విజయ్ కుమార్ ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే హార్డ్ డిస్క్ మిస్ అవ్వడం నిజమేనని.. కానీ అందులో ఏ కంటెంట్ అనేది ఇంకా తెలియదని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి ప్రమోషన్స్ నిర్వహిస్తున్న మేకర్స్ కు హార్డ్ డిస్క్ వ్యవహారం తలనొప్పిగా మారిందని చెప్పాలి.ఇక మూవీ విషయానికొస్తే.. కన్నప్ప రోల్ లో మంచు విష్ణు కనిపించనున్నారు. మహా శివుడి పాత్రలో బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ నటించారు. కాజల్ అగర్వాల్ పార్వతీ దేవిగా యాక్ట్ చేశారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మాలీవుడ్ స్టార్ హీరో మోహన్ లాల్ వంటి పలువురు భారీ స్టార్స్ భాగమయ్యారు. మహాభారతం ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఆ సినిమాను డైలాగ్ కింగ్ మోహన్ బాబు భారీ బడ్జెట్ తో నిర్మించారు. స్టీఫెన్ దేవసి ఆ చిత్రానికి మ్యూజిక్ అందించారు.


గ్రాండ్ విజువల్స్ అండ్ భారీ వీఎఫ్?ఎక్స్ సినిమాలో ఇప్పటికే ఉండనున్నట్లు క్లారిటీ వచ్చేసింది. మరి మంచు విష్ణు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కన్నప్ప ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## వీరమల్లు డిస్ట్రిబ్యూషన్ పై ఇంట్రెస్టింగ్ అప్డేట్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న హరిహర వీరమల్లు సినిమా కోసం ఫ్యాన్స్ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. కరోనాకు ముందు మొదలైన ఈ సినిమా మొత్తానికి అన్ని అడ్డంకులు దాటుకుని జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించిన ఈ సినిమాలో యానిమల్ ఫేమ్ బాబీ డియోల్ ఔరంగజేబు పాత్రలో కనిపించనున్నాడు. ముందుగా ఈ సినిమాను డైరెక్టర్ క్రిష్ మొదలుపెట్టాడు. కానీ తర్వాత సినిమా షూటింగ్ లేటవడంతో డైరెక్టర్ క్రిష్ ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నాడు. దీంతో నిర్మాత ఏఎం రత్నం కొడుకు జ్యోతికృష్ణ సినిమా బాధ్యతల్ని తీసుకుని సినిమాను పూర్తి చేశాడు. భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ అవుతుంది. తెలుగుతో పాటూ తమిళ, హిందీ, మలయాళ భాషల్లో మేకర్స్ ఈ సినిమా రిలీజ్ ను గ్రాండ్ గా ప్లాన్ చేశారు. రిలీజ్ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ఈ సినిమా బిజినెస్ ను క్లోజ్ చేసే పనిలో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సినిమా డిస్ట్రిబ్యూషన్ కు సంబంధించి ఇంట్రెస్టింగ్ బజ్ వినిపిస్తోంది. అందులో భాగంగానే హరిహర వీరమల్లును కేరళలో ప్రముఖ హీరో దుల్కర్ సల్మాన్ తన డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ద్వారా రిలీజ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. దుల్కర్ ఈ సినిమాను రిలీజ్ చేస్తుండటంతో కేరళలో ఈ సినిమాకు మంచి బజ్ వచ్చే ఛాన్సుంది. మరోవైపు వీరమల్లు నైజాం మార్కెట్ కు సంబంధించి కూడా ఓ ఇంట్రెస్టింగ్ బజ్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం సితార సంస్థ రేస్ లో ఉందని టాక్ వినిపిస్తోంది. అయితే ఇప్పుడు ఈ డిస్ట్రిబ్యూషన్ రేస్ లోకి మైత్రీ డిస్ట్రిబ్యూషన్ వారు కూడా వచ్చారని తెలుస్తోంది. దీంతో వీరమల్లు నైజాం హక్కులు ఎవరికి సొంతం అవుతాయనేది ఇంట్రెస్టింగ్ గా మారింది. ఎం.ఎం కీరవాణి సంగీతం అందించిన ఈ సినిమాకు గ్రాండ్ గా ప్రమోషన్స్ స్టార్ట్ చేయనున్నారు.


## అదృష్టానికే అదృష్టవంతురాలు ఈహీరోయిన్!



హీరోయిన్ గా సక్సెస్ అవ్వాలంటే అందం..అభినయం ట్యాలెంట్ తో పాటు అదృష్టం కూడా కలిసి రావాలి. అప్పుడే అది సాధ్యమవుతంది. అందమైన భామలంతా హీరోయిన్లు కాలేరు. ప్రతిభ ఒక్కటే ఉన్నా సాధ్యం కాదు. ఆ రెండింటితో పాటు అదృష్టం కూడా తోడైతేనే సాధ్యమవుతుంది. కానీ కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ మాత్రం అదృష్టానికి అదృష్టవంతురాలు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అమ్మడు %-%సప్తసా గరాలు దాటి%-% అనే కన్నడ చిత్రంతో తెలుగు నాట పరిచయమైన సంగతి తెలిసిందే. తొలి సినిమా తో ఇక్కడ మంచి పేరు తీసుకొచ్చింది. అమ్మడికి ఈ సినిమాలో అవకాశం ఎంత ఈజీగా వచ్చిందో తెలిస్తే షాక్ అవుతారు. అవును ఈ విషయంలో తానెంతో లక్కీ అని రుక్మిణీ చెప్పుకొచ్చింది. ఆ సినిమా డైరెక్టర్ ఇచ్చిన ప్రకటన పేపర్లో చూసి అతడి నెంబర్ కు ఒక్క మేసేజ్ పెట్టిందిట. అనుమతి ఇస్తే ఆడిషన్ లో పాల్గొంటాను అని ఆ మెసేజ్ లో ఉంది. నటనలో తను అభనువాన్ని అందులో జోడించింది. సరే రండి అని రిప్లై ఇచ్చారుట. ఆ మేసేజ్ డైరెక్టర్ చూడకపోయి ఉంటే ఆ ఛాన్స్ తనకు వచ్చేది కాదని...దీన్నే అదృష్టం అంటారని పేర్కొంది.

కాబట్టి ఎంత కష్టపడినా సరే ఆవగింజంత అదృష్టం కూడా కలిసొస్తేనే గొప్ప స్థానానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రుక్మిణీ వసంత్ ఏకంగా పాన్ ఇండియా ఛాన్సులే అందుకుంటుంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన - డ్రాగన్ - లో నటిస్తోంది. కన్నడ బ్యూటీ కావడంతో ప్రశాంత్ నీల్ మరో ఆలోచన లేకుండా రుక్మిణీని తీసుకున్నాడు. అలాగే మురగదాస్ దర్శకత్వం వహిస్తోన్న - మదరాసి - లోనూ ఈ భామే హీరోయిన్. విజయ్ సేతుపతికి జోడీగా %-ఏస్ - అనే చిత్రంలోనూ నటిస్తోంది. ఇలా ఇన్ని ఛాన్సులు వచ్చాయంటే కారణం తొలి సినిమాతో తానేంటే ప్రూవ్ చేసు కోవడంతోనే సాధ్యమైంది. ఇక్కడ ట్యాలెంట్ వర్కౌట్ అయింది.

## అందాల భామ చేతికి ఇంటర్నేషనల్ బ్రాండ్..!



టాలీవుడ్ అందాల భామ శ్రీ లీల ఓ పక్క సినిమాల్లో నటిస్తూనే మరోపక్క వాణిజ్య ప్రకటనలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తుంది.

సినిమాల పరంగా ఈమధ్య కాస్త జోరు తగ్గించిందని అనిపించినా మళ్లీ ఊపందుకునేలా వరుస క్రేజీ సినిమాలు చేస్తుంది శ్రీలీల.

అందంతోనే కాదు అభినయంతో కూడా అదరగొట్టేస్తుందని భగవంత్ కేసరి లాంటి సినిమా చూస్తే అర్థమయ్యింది.ప్రస్తుతం అమ్మడు మాస్ మహారాజ్ రవితేజతో మరోసారి మాస్ జాతర సినిమాలో నటిస్తుంది.

ఈ ఇద్దరు కలిసి చేసిన ధమాకా సూపర్ హిట్ అవ్వడంతో ఈ కాంబినేషన్ మీద భారీ అంచనాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఈమధ్య యాడ్స్ లో బాగా కనిపిస్తున్న శ్రీలీల చేతికి మరో క్రేజీ బ్రాండ్ వచ్చి చేరిందని తెలుస్తుంది. ఈసారి అమ్మడు ఇంటర్నేషనల్ బ్రాండ్ ని సొంతం చేసుకుంది. లండన్ కి చెందిన ఇంటర్నేషనల్ ఫ్రాంగ్రన్స్ యార్డ్ లీ కి అమ్మడి బ్రాండ్ అంబాసిడర్ గా ఉంటుంది. ఇందుకు శ్రీలీల భారీ మొత్తంలోనే రెమ్యునరేషన్ అందుకుంటుందని తెలుస్తుంది. యార్డ్ లీ కి ఇదివరకు బాలీవుడ్ తారలు బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్నారు. ప్రస్తుతం శ్రీలీల వారందరినీ కాదని ఆ బ్రాండ్ కి ఇండియాలో బ్రాండింగ్ చేస్తుంది. ఇంటర్నేషనల్ ఫ్రాగ్రన్స్ మొదటి ఛాయిస్ శ్రీలీల అవ్వడం క్రేజీ విషయమని చెప్పొచ్చు.

ఈమధ్య సౌత్ హీరోయిన్స్ కూడా అన్నిట్లో బాలీవుడ్ భామలకు పోటీ ఇస్తున్నారు. పాన్ ఇండియా సినిమాలతో వారికి ఈక్వెల్ క్రేజ్ ని అందుకోవడమే కాదు వారికి ఈక్వల్ రెమ్యునరేషన్ కూడా తీసుకుంటున్నారు.

అంన్స్ అక్కడ టాతేకాదు బాలీవుడ్ లో లాంటి హీకూడా సౌత్ భామల సందడి మొదలైంది.

రష్మిక రోయిప్ స్టార్స్ తో వరుస సినిమాలు చేస్తున్నారు. సో మారిన ఈ మొమెంటం ని మన ఆడియన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. యువ హీరోయిన్స్ లో శ్రీలీల సంథింగ్ స్పెషల్ గా ఉంటుంది.

సౌత్ సినిమాలతో పాటు బాలీవుడ్ సినిమాలను కూడా చేస్తుంది అమ్మడు.

ప్రస్తుతం అక్కడ కార్తీక్ ఆర్యన్ తో ఒక లవ్ స్టోరీ చేస్తుంది శ్రీలీల. ఆ సినిమా ఆషికి 3 అంటూ కొందరు చెబుతున్నారు.

మేకర్స్ నుంచి మాత్రం ఇంకా ఎలాంటి కన్ఫర్మేషన్ రాలేదు.

ఐతే రిలీజైన టీజర్ చూస్తే మాత్రం అది కచ్చితంగా ఆషికి 3 అనే ఫీల్ కలిగిస్తుంది.

## 3 రోజెస్ సీజన్ 2... బెట్టింగ్ భోగి ఎంట్రీతో ఫన్ వేరే లెవెల్!

టాలీవుడ్ హీరోయిన్స్ పాయల్ రాజ్ పుత్, ఈషా రెబ్బా, పూర్ణ మెయిన్ రోల్స్ లో నటించిన 3 రోజెస్.. ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యి ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. 2021లో రిలీజ్ అయిన 3 రోజెస్ సిరీస్ సూపర్ రెస్పాన్స్ అందుకుంది. డిఫరెంట్ కాన్సెప్ట్ తో వచ్చిన ఆ సిరీస్ కు యూత్ బాగా అట్రాక్ట్ అయిపోయారు. ఇప్పుడు 3 రోజెస్ సీజన్ 2 రానున్న సంగతి విదితమే. సీజన్ 2కు రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా.. కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహిస్తున్నారు. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కే ఎన్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మారుతి షో రన్నర్ గా వ్యవహరిస్తున్నారు. అయితే అనౌన్స్మెంట్ టీజర్ ను ఉమెన్స్ డే సందర్భంగా మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేయగా.. అందరినీ ఆకట్టుకుంది. పంచ్ డైలాగ్ లతో ఉన్న గ్లింప్స్.. నవ్వించింది. అయితే అనౌన్స్మెంట్ టీజర్ తో సీజన్ సీక్వెల్ పై క్యూరియాసిటీ పెంచారు మేకర్స్. హర్ష, ఈషా రెబ్బ అనౌన్స్మెంట్ టీజర్ లో కనిపించగా.. సీక్వెల్ లో పాయల్ రాజ్‌పుత్, పూర్ణ ఉండరని అర్థమవుతోంది. అదే సమయంలో ఇప్పుడు మేకర్స్ మరో అప్డేట్ ఇచ్చారు. 3 రోజెస్ సీక్వెల్ లో కమెడియన్ సత్య భాగమైనట్లు తెలిపారు. బెట్టింగ్ సత్యగా నటించనున్నట్లు అనౌన్స్ చేశారు. సిల్వర్ స్క్రీన్ ను రూల్ చేసిన ఆయన.. ఇప్పుడు ఓటీటీలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. సీజన్ 2లో సత్య ఉండడంతో కామెడీ మరో మలుపు తిరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ గ్లింప్స్ రిలీజ్ చేశారు ఐపీఎల్ మ్యూజిక్ తో స్టార్ట్ అయిన గ్లింప్స్ తో సత్యను పరిచయం చేశారు మేకర్స్. అతడు ఐపీఎల్ మ్యాచుల్లో బెట్టింగ్స్ వేస్తుంటాడు. బెట్టింగ్ వద్దని అందరూ చెబుతున్నా.. తనదైన రీతిలో బెట్స్ కాస్తుంటారు. కొన్ని మ్యాచ్ ల తర్వాత రూ.10 లక్షలు నష్టపోతారు. దీంతో అందరినీ డబ్బులు అడుగు తుంటారు. ఏదో మ్యాజిక్ చేయాలని అంటుంటారు. గ్లింప్స్ బట్టి సత్య మంచి కామెడీ అందించ నున్నారని క్లియర్ గా తెలుస్తోంది. సీజన్ 2పై అంచనాలు కూడా పెరుగుతున్నాయని చెప్పాలి. మొత్తానికి సరైన నటుడిని రంగంలోకి దించారు మేకర్స్. ప్రస్తుతం గ్లింప్స్ వైరల్ గా మారి.. అందరినీ మెప్పిస్తోంది. కాగా, సీజన్ లో వైవా హర్ష, కుషిత కల్లపు సహా పలువురు నటిస్తున్నారు. మరి సీజన్ ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ అవుతుందో వేచి చూడాలి.




Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh, epaper. www.saisuryaa.com.saisuryaadaily @gmail.com